
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 2 అక్టోబరు 2024

కనురెప్పే కాటేసింది!

ఓ కసాయి తండ్రి ఘాతుకం ● కుమార్తెపైనే లైంగికదాడి ● తల్లిరోదనను 'లైట్' తీసుకున్న స్థానికులు ● అంతా అయ్యాక తేరుకుని పోలీసులకు సమాచారం

తల్లి జన్మనిస్తే.. తండ్రి చేయిపట్టి నడిపించి, విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో ఉన్నతంగా నిలబడేలా చేస్తాడు. అంతటి మహోన్నత పదానికి ఓ కసాయి మచ్చ తెచ్చాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కర్కశంగా మారాడు. తాగిన మైకంలో కన్న కూతురినే చెరబట్టి తన కామవాంఛ తీర్చుకున్నాడు. కళ్లెదుటే తన కన్నపేగును చిదిమేస్తుంటే తల్లి గుండెలవిసేలా రోదించింది. ఈ రోదనను 'లైట్' తీసుకున్న బంధువులు అంతా అయ్యాక తేరుకున్నారు. నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అల్లూరు మండలం నార్తుమోపూరు దళితవాడలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలి తల్లి, పోలీసుల కథనం మేరకు..

అల్లూరు, అక్టోబరు 1 : నార్తుమోపూరు దళితవాడకు చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు. కూలి పనులు చేసుకుంటున్న ఆ కుటుంబ పెద్ద నిత్యం మద్యం సేవించి, భార్య, పిల్లలను కొడుతుండేవాడు. సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అదే సమయంలో తల్లితో కలిసి రెండవ కుమార్తె బహిర్భూమికని పెరట్లోకి వెళ్లింది. అప్పటికే ఇంట్లో నిద్రిస్తున్న చిన్న కుమార్తెను బయటికి పంపి తలుపులు వేసి గొళ్లెం పెట్టాడు. గమనించిన భార్య తలుపు తెరవమని ఎన్నిసార్లు ప్రాధేయపడినా తలుపు తెరవకపోగా, పెద్ద కుమార్తెపై (12) గట్టిగా కేకలు వేస్తూ చావబాదాడు. కొట్టవద్దని భార్య బయటి నుంచి వారించినా పిల్లలు తన మాట వినడం లేదని తన బాధ్యతను నిర్వర్తిస్తున్నట్లు నటించాడు. కాసేపటికి ఇంట్లో లైటు ఆర్పివేయడంతో భార్యకు అనుమానం వచ్చి గట్టిగా తలుపులు బాదింది. అయినా తలుపులు తెరవక పోగా బాలిక అరవకుండా నోటికి అడ్డుపెట్టాడు. దీంతో అరుపులు ఆగిపోయాయి. సుమారు గంటపాటు తలుపులు తెరవకుండా ఉండటంతో మరింత భయభ్రాంతులకు గురైన భార్య చుట్టుపక్కల వారికి చెప్పినా ఇది సహజమేకదా..? అని వారు స్పందించలేదు. ఇద్దరు కుమార్తెలతో రోదిస్తూ ఆ తల్లి ఇంటి బయటే నిస్సహాయంగా ఉండిపోయింది. అనంతరం తలుపులు తెరవడంతో ఆ బాలిక పరుగులు తీస్తూ బయటకు వచ్చింది. అప్పటికే అనుమానం వచ్చిన తల్లి ఏం జరిగిందని ఎంత అడిగినా భయంతో ఆ బాలిక ఏమీ చెప్పలేదు. కొద్దిసేపటికి తేరుకున్న బాలిక తనపై తన తండ్రి చేసిన అఘాయిత్యాన్ని బయటపెట్టింది. దీంతో ఆమె అరుపులు విని పక్కనే ఉన్న బంధువులు వచ్చి బాలికను విచారించగా జరిగిన తతంగమంతా వారికి వివరించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు.



● పోక్సో కేసు నమోదు

కావలి సీఐ పాపారావు, ఎస్‌ఐ కిషోర్ బాబులు మాట్లాడుతూ జరిగిన ఘటనపై విచారించామని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వైద్యపరీక్షల నిమిత్తం బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి పంపించామని తెలిపారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి ఇంతటి దారుణానికి పాల్పడటం హేయమని, నిందితుడిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు. గతంలో కూడా వెంకటరమణయ్య ఇద్దరు మహిళలపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు.

చేజర్లలోనూ..

చేజర్ల : మనుషుల్లో రోజురోజుకీ నైతిక విలువలు మృగ్యమవుతున్నాయి. బాలికా సంరక్షణా చట్టాలు కూడా నేరగాళ్లను అపలేకపోతున్నాయి. చిన్నారులపై లైంగిక దాడులు చేస్తే ఉరిశిక్ష వేసేలా చట్టాలను మార్చినా అన్నెంపున్నెం ఎరుగని పసికందులను కామాంధులు చిదిమేస్తూనే ఉన్నారు. తాజాగా చేజర్ల మండలంలోని ఒక గ్రామంలో నాలుగురోజుల క్రితం ఓ బాలికపై తండ్రే అత్యాచారం చేశాడు. అయితే సోమవారం రాత్రి బాధితురాలు ఆమె తల్లితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మంగళవారం గ్రామంలో విచారించారు. సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

నెల్లూరు (క్రైం) అక్టోబరు 1 : ప్రైవేటు వైన్ షాపుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో కలెక్టర్ ఆనంద్ జిల్లాలో 182 వైన్‌షాపుల ఏర్పాటుకు గజిట్ విడుదల చేశారు. ఈ మేరకు షాపుల వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు వెల్లడించారు.

జిల్లాలో 182 వైన్‌షాపులు

- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు
- 11వ తేదీన నెల్లూరులో డ్రా
- 12 నుంచి షాపుల ఓపెన్
- ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు

● ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు

ఈ నెల 1 నుంచి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆశావహులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోని ప్రొఫార్మాను పూర్తి చేసి దరఖాస్తును వేయవచ్చు. ఆఫ్‌లైన్‌లో ఏ ప్రాంతంలో వైన్‌షాపు ఏర్పాటు చేయదలుచుకున్నారో వివరిస్తూ ఏ ఎక్సైజ్ స్టేషన్‌లోనైనా దరఖాస్తు సమర్పించాలి. ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షలు నాన్‌రీఫండబుల్ నగదు చెల్లించాల్సి ఉంటుంది. జనాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజులను నిర్ధారించారు. 9వ తేది సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల ప్రక్రియ ముగిశాక, 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో లక్కీడిప్ ద్వారా షాపులను వ్యాపారులకు కేటాయిస్తారు. 12వ తేదీ నాటికి లైసెన్సు ఫీజు, వైన్ షాపు ఏర్పాటు చేసే ప్రాంతం చూపించి నిబంధనల మేరకు అన్నీ సక్రమంగా ఉంటే అదేరోజు వైన్‌షాపులను వ్యాపారులు ప్రారంభించుకోవచ్చని డీసీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో ఏసీ దయాసాగర్, ఈఎస్ శ్రీనివాసుల నాయుడు, డిపో మేనేజర్ ఆయూషా బేగం, తదితరులు పాల్గొన్నారు.

● రూ.115.70 కోట్ల ఆదాయం

ప్రభుత్వం విధించిన లైసెన్సు ఫీజుల ప్రకారం జిల్లాలో రూ.55 లక్షల ఫీజు ఉన్న దుకాణాలు 98, రూ.65 లక్షలు ఫీజు ఉన్న దుకాణాలు 45, రూ.85 లక్షల ఫీజు ఉన్న దుకాణాలు 36 ఉన్నాయి. దీనిప్రకారం అన్ని దుకాణాల లైసెన్సు ఫీజు ఈ ఏడాదికి ప్రభుత్వానికి రూ.115.7 కోట్ల ఆదాయం సమకూరనుంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి మరో పది శాతం అదనంగా ఆదాయం సమకూరనుంది. దరఖాస్తు ఫీజుల రూపేణా రూ.కోట్లలో ఆదాయం రాష్ట్ర ఖజానాకు రానుంది.



గుడిపల్లిపాడు వద్ద మద్యం కోసం ఎదురు చూస్తున్న మందుబాబులు

జిల్లావ్యాప్తంగా వైన్‌షాపుల లైసెన్సు ఫీజు (రూ.లక్షల్లో)

ప్రాంతం	షాపులు	2024-25	2025-26
నెల్లూరు కార్పొరేషన్	30	85	93.50
నెల్లూరు రూరల్	3	55	60.50
వెంకటాచలం	6	65	71.50
మనుబోలు	3	55	71.50
కావలి మున్సిపాలిటీ	6	65	71.50
కావలి రూరల్	4	65	71.50
జలదంకి	3	55	60.50
అల్లూరు	4	55	60.50
అల్లూరు రూరల్	2	55	60.50
కోవూరు	6	85	93.50
కొడవలూరు	5	55	60.50
విడవలూరు	4	55	60.50
బుచ్చిరెడ్డిపాలెం	6	55	60.50
బుచ్చిరెడ్డిపాలెం రూరల్	3	55	60.50
దగదర్తి	2	55	60.50
సంగం	3	55	60.50
ఉదయగిరి	3	55	60.50
దుత్తలూరు	2	55	60.50
మర్రిపాడు	5	55	60.50
సీతారామపురం	2	55	60.50
వింజమూరు	3	55	60.50
కలిగిరి	4	55	60.50
కొండాపురం	3	55	60.50
వరికుంటపాడు	2	55	60.50
ఇందుకూరుపేట	5	65	71.50
తోటపల్లిగూడూరు	5	65	71.50
ముత్తుకూరు	8	65	71.50
ఆత్మకూరు	4	55	60.50
ఆత్మకూరు రూరల్	2	55	60.50
అనంతసాగరం	2	55	60.50
కలువాయి	2	55	60.50
అనంతసాగరం	3	55	60.50
పొదలకూరు	6	65	71.50
చేజర్ల	3	55	60.50
రాపూరు	4	55	60.50
సైదాపురం	4	55	60.50
కందుకూరు	4	65	71.50
కందుకూరు	1	55	60.50
ఉలవపాడు	4	65	71.50
లింగసముద్రం	2	55	60.50
గుడ్లూరు	3	55	60.50
వలేటివారిపాలెం	3	55	60.50

ఆర్టీసీ బస్సెక్కుతున్న ప్రయాణికులు



రేపటి నుంచి దసరా సెలవులు

● నేడు గాంధీ జయంతి సెలవు ● ఊర్లకు పయనమైన విద్యార్థులు ● 8 నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నెల్లూరు (విద్య) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు గురువారం నుంచి 13వతేదీ వరకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని డీఈవో రామారావు తెలిపారు. విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారం ఈనెల 4 నుంచి 13వతేదీ వర కు దసరా సెలవులు ప్రకటించాల్సి ఉన్నా, ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు ఒకరోజు ముందుగానే సెలవులు ప్రకటిస్తున్నామన్నారు. పాఠశాలలన్నీ కూడా ఈనెల 14వతేదీన పునః ప్రారంభం అవుతాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని, వాటిని అతిక్రమించి తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాగా, బుధవారం గాంధీ జయంతి సెలవు దినం కావడంతో విద్యాలయాలు బుధవారం నుంచే మూతపడనున్నాయి. ఈ నేపథ్యంలో రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. వీరితోపాటు సెలవులకు ఊర్లకు వెళ్లే వాళ్లతో మంగళ వారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్లలో రద్దీ నెలకొంది.

● దసరాకు అదనపు బస్సులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి ఎం మురళీబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. 8వ తేదీ హైదరాబాద్ నుంచి నెల్లూరు పరిసరప్రాంతాలకు 6 బస్సులు, 9వ తేదీ 11 బస్సులు, 10వ తేదీ 22, 11వ తేదీ 26 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే 8 నుంచి 11వ తేదీ వరకు బెంగళూరు నుంచి నెల్లూరుకు ప్రతి రోజూ 2 ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. విజయవాడ, చెన్నై, కడప నుంచి ఐదేసి చొప్పన బస్సులు అదనంగా నడుస్తాయన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తారని, రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని ప్రకటించారు.

గురుశిష్యుల గుట్టు రట్టు

'ముత్తుకూరు' దోపిడీ ఉదంతంతో వెలుగులోకి!

● శిష్యుడు హసన్ అరెస్ట్‌తో కదిలిన డొంక
● బట్టబయలైన సహ నేరస్థుల చిట్టా
● త్వరలో పలువురు మోసగాళ్ల అరెస్టుకు రంగం సిద్ధం

ఆలీబాబా 40 దొంగలు కథ వినే ఉంటారు. అచ్చం అలాగే 40 మంది అనుచరులతో నెల్లూరు జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలను మోసం చేస్తూ రూ.కోట్లు కొల్లగొట్టిన ఘరానా దొంగ గుట్టు రట్టయ్యింది. ఇటీవల ముత్తుకూరు జరిగిన దోపిడీ ఘటనలో శిష్యుడిని అరెస్ట్ చేసిన పోలీసులు గురువు పనిపట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఒక నోటుకు మూడు నోట్లు ఇస్తాం, ఇత్తడి ధరకే పుత్తిడి (బంగారం) ఇస్తాం, కారుచౌకగా ఖరీదైన భూములు అమ్మేస్తాం.. వంటి రకరకాల మోసాలతో ప్రజలను లూటీ చేస్తున్న ఈ గురుశిష్యులను న్యాయపరంగా కాపాడుతూ వస్తున్న ఇద్దరు బడా వ్యక్తులపైనా ఆరా తీస్తున్నారు.

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : గత నెల 20వ తేదీన ముత్తుకూరులో కారుచౌకగా భూమి అమ్ముతామని రూ.50లక్షలతో వచ్చిన వ్యక్తిని మోసగించిన ఘరానా మోసగాళ్ల కథ పాఠకులకు గుర్తుండే ఉంటుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు 21వ తేదీ రాత్రి చెన్నై విమానాశ్రయంలో ఈ మోసగాళ్లను అరెస్టు చేశారు. ఈ మోసంలో ప్రధాన నిందితుడైన షేక్ హసన్‌తోపాటు మరో ఇద్దరు అనుచరులను అరెస్టు చేశారు. ముగ్గురు పరారయ్యారు. ఈ అరెస్టుతో ఘరానా మోసగాళ్ల గుట్టు మొత్తం రట్టు అయినట్లు సమాచారం.

● 20కి పైగా సిమ్‌కార్డులు

మోసాలు, నేరాలు, దొంగతనాల్లో చేయితిరిగిన వ్యక్తిగా గుర్తింపు పొందిన హసన్‌కు మొత్తం 40 మంది అనుచరులు ఉన్నారు. వీరిలో మహిళలు, ఆటో డ్రైవర్లు, సెల్‌ఫోన్ షాపులు నడిపేవారు ఇలా రకరకాల వృత్తులు చేసేవారు హసన్ చేసే మోసాలకు వివిధ రూపాల్లో సహకరిస్తున్నారు. అంతేకాదు హసన్ తన నేరాల కోసం రకరకాల సిమ్ కార్డులు వినియోగించాడని తెలిసింది. ఈ సిమ్ కార్డుల నెంబర్లు సైతం గుర్తించినట్లు సమాచారం. కారు చౌకగా బంగారం విక్రయిస్తామని, నకిలీ కరెన్సీ ఇస్తామని, ఇంటి వద్దే ఒక నోటుకు మూడు నోట్లు చేసి ఇస్తామని ఇలా రకరకాల మోసాలతో ఈ ముఠా ప్రజలను మోసం చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టిందనే విషయం వెలుగుచూసింది.

● గురువు గుట్టు రట్టు!?

హసన్ గురువుది కావలి ప్రాంతం. ఆయనకు హసన్ లాంటి శిష్యులు చాలా మంది ఉన్నారు. ఈ గురువు ఇల్లు పోలీసులకు సైతం దుర్భేద్యం. పటిష్టమైన భవనం, చుట్టూ బలమైన జాగిలాల కపలా ఉంటుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఈయనఇంటిపై పోలీసు నీడ పడకుండా వందలాది కుటుంబాలున్న ఒక గ్రామం. ఆయనపై ఇప్పటికే లెక్కలేనన్ని నేరారోపణలు ఉన్నాయి. ఈయన నేర ప్రవృత్తికి గత ప్రభుత్వ హయాంలో కొంత మంది వైసీపీ నాయకులు కంచెగా కాపు కాసినట్లు సమాచారం. ప్రభుత్వం మారడం, ఈయన శిష్యుడు పట్టుపబడటంతో గురువుకు కష్టకాలం తప్పదని అంటున్నారు.

● థీఫ్ మేకర్లకు కష్టకాలమే

రాజులను తయారు చేసేవారిని కింగ్ మేకర్ అంటారు. దొంగలను శిక్ష నుంచి కాపాడే వారిని ఏమంటారు. థీఫ్ మేకర్స్ అంటారు. కింగ్ మేకర్స్ తరహాలోనే ఈ థీఫ్ మేకర్స్ కూడా సంగంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నారు. ఘరానా నేరస్థులకు చట్టపరంగా రక్షణ కల్పిస్తున్నారు. ఇప్పుడు వీరి గుట్టు కూడా రట్టు అయ్యింది. పార్టీ ఆవిర్భావం నుంచి నేటివరకు శాంతి భద్రతల విషయంలో ఏమాత్రం రాజీపడని తెలుగుదేశం అధికారంలోకి రావడంతో ఘరానా మోసగాళ్ల మూలాలపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లా పోలీసు యంత్రాగం ఈ ఘరానో మోసగాళ్ల విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినట్లు ప్రచారం. దీంతో ఈ కేసుల విచారణకు, ఘరానా మోసగాళ్లను కట్టడి చేయడానికి అత్యున్నత నేర పరిశోధన విభాగం రంగంలోకి దిగనున్నట్లు తెలిసింది.

ఏమయ్యాయబ్బా!

● కావలి మున్సిపాలిటీలో పాత ఫైళ్ల మాయం
● రూ.2.5 కోట్ల బిల్లుల పెండింగ్
● నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనివే!
● వెతికి పెట్టాలంటున్న 'దేశం' నాయకులు
● అంతవరకు బదిలీ అధికారులకు 'నో రిలీవ్'!

కావలి, అక్టోబరు 1 : కావలి పురపాలక సంఘంలో 2014-19 మధ్య చేపట్టిన కొన్ని పనులకు సంబంధించిన ఫైళ్లు కనిపించడం లేదు. అప్పటి టీడీపీ హయాంలో ప్రజలకు మంచినీరు సరఫరా చేసిన ట్యాంకుల నిర్వాహకులకు రూ.2 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. అలాగే చిన్న చిన్న వర్కులకు సంబంధించి మరో రూ.50 లక్షల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావటంతో పాత బిల్లులు చెల్లించకుండా ఆపేశారు. బిల్లుల కోసం పార్టీలు మారినా, నేతల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతలం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా బిల్లులు ఇస్తారన్న ఆశతో ట్యాంకర్ల నిర్వాహకులు ఉన్నారు.

● సూత్రధారులు ఎవరు?

అయితే, ట్యాంకర్లు ఇవ్వాల్సిన నగదు, పనులు చేసిన కాంట్రాక్టర్ల ఫైళ్లు మున్సిపల్ కార్యాలయంలో అదృశ్యమయ్యాయి. దీనివెను సూత్రధారులు ఎవరైనా అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది. కార్యాలయంలోని బీరువాలలో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో ఉండాల్సిన ఫైళ్లు కనిపించకుండా ఎక్కడకు పోతాయని ప్రశ్నిస్తున్నారు. పని చేసిన వారికి బిల్లులు ఇవ్వకుండా ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని వైసీపీ నేతల సూచనల మేరకు కొందరు అధికారులే వాటిని మాయం చేసి ఉంటారనే ప్రచారం నడుస్తోంది.

● వారిని రిలీవ్ చేయద్దు!

మాయమైన ఫైళ్లను వెతికి పెట్టే వరకు సంబంధిత అధికారులను రిలీవ్ చేయవద్దని కొందరు టీడీపీ నేతలు మున్సిపల్ కమిషనర్, డీఈపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే బదిలీ అయిన సిబ్బంది చాలా వరకు రిలీవ్ అయి వెళ్లిపోయారు. ఇంజనీరింగ్ శాఖలో ఏఈలు మాత్రం రిలీవ్ కాలేదు. రిలీవ్ చేయమని ఏఈలు అడుగుతున్నా పాత ఫైళ్లు వెతికి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో ఫైళ్ల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఫైళ్లు వెతుకుతున్నాం!

గతంలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసిన పనులకు సంబంధించిన ఫైళ్లు కనిపించలేదు. అప్పట్లో నేను డీఈగా లేను. అయినా వాటిని వెతికిస్తున్నా. బదిలీ అయిన ఏఈలను ఇంకా రిలీవ్ చేయలేదు.

- సాయిరాం, డీఈ, కావలి పురపాలకసంఘం

నాకు తెలియకుండానే జడ్పీలో ఉద్యోగుల బదిలీలు

● ఇది చట్ట విరుద్ధం.. రద్దు చేయండి!
● లేకుంటే కోర్టును ఆశ్రయిస్తా : జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 1 : జిల్లా పరిషత్‌లో తన ఆమోదం లేకుండానే అధికారులు ఇష్టానుసారంగా బదిలీలు చేశారని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మండిపడ్డారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ చైర్మన్ ఆమోదం లేకుండా రాజ్యాంగబద్ధంగా బదిలీలు చేసేందుకు వీల్లేదన్నారు. కేవలం ఎంపీడీవోల బదిలీల నోట్‌ఫైల్ మాత్రమే తనకు పెట్టి సాధారణ ఉద్యోగులు బదిలీలకు సంబంధించి తనకు తెలియకుండానే గత సీఈవో, డిప్యూటీ సీఈవో ఇష్టానుసారంగా బదిలీలు చేశారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఈ బదిలీలను రద్దు చేయాలని కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రికి ఇప్పటికే విన్నవించినట్లు చెప్పారు. బదిలీలను రద్దు చేయడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. జడ్పీ చైర్మన్‌కు రాజ్యాంగబద్ధంగా సక్రమించిన అధికారాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మర్రిపాడు, కొండాపురం, ఆత్మకూరు, గూడూరు, సూళ్ళూరుపేట జడ్పీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, వెంకట్రావు, ప్రసన్న, యామిని తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 97.03 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం తొలిరోజే 97.03 శాతం జరిగింది. జిల్లాలో 3,09,711 మందికి పింఛను ఇవ్వాల్సి ఉండగా 3,00,512 మందికి తొలిరోజు అందచేశారు. మిగిలిన 9199 మందికి బుధవారం పింఛను అందించనున్నారు. ఏడు వేల మంది ప్రభుత్వ సిబ్బంది ఇందులో భాగస్వాముల య్యారు. తోటపల్లి గూడూరు మండలంలో అత్యధికంగా 98.16 శాతం పంపిణీ జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం మండలం వవ్వేరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛను మొత్తాన్ని అందచేశారు. గూడ్లూరు మండలంలోని పొట్లూరులో డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి పెన్షన్ పంపిణీలో పాల్గొన్నా రు. ఇదేవిధంగా పలు ప్రాంతాల్లో అధికారులు, నాయకులు పెన్షన్లను పంపిణీ చేశారు.

ఆలస్యంగా తెరుచుకున్న దుకాణాలు

జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉదయం ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరుచుకోలేదు. దీంతో మద్యం కోసం ఎదరు చూస్తున్న మందుబాబులకు ఎందుకు మద్యం దుకాణాలు తెరుచుకోలేదో తెలియక బార్లకు పరుగులు తీశారు. నూతన మద్యం పాలసీ అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో విధులు నిర్వహించే సిబ్బంది దుకాణాలకు రాలేదు. విషయం తెలుసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు, ఏసీ, ఈసీ, డీఎంలను అప్రమత్తం చేయడంతో వారు సిబ్బందిని దుకాణాల వద్ద పంపారు. సిబ్బంది దుకాణాల వద్దకు వెళ్లి సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లకు ఫోన్‌లు చేసి కొన్ని దుకాణాలను తెరిపించారు. అయితే కొందరు సిబ్బంది ఉద్యోగ భద్రత లేని దుకాణాల్లో తాము పనిచేయమని చెప్పి తాళాలు ఇచ్చేసి వెనుదిరిగారు. ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసి మంగళవారం మధ్యాహ్నానికి 80 శాతం దుకాణాలను తెరిపించారు. 'మద్యం దుణాణాలపై అయోమయం' అంటూ ఆంధ్రజ్యోతి రెండు రోజుల ముందే ఓ కథనం ప్రచురించింది. అప్పుడే అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని ఉంటే ఇబ్బందులు ఉండేవి కావు. బుచ్చిరెడ్డిపాళెంలో సాయంత్రానికి మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి.

ఆన్‌లైన్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు మినరల్ చాంబర్ ఆఫ్ కామర్స్ వినతి



చంద్రబాబుతో మినరల్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 1 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మినరల్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు మంగళవారం రాష్ట్ర సచివాయంలో కలిశారు. సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు సీఎంతో భేటీ అయ్యారు. మైనింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆన్‌లైన్ పర్మిట్ విధానాన్ని తెరవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. వీటికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రణయ్‌రెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళకు టోకరా

● నగదు లెక్కిస్తామని రూ.16 వేలతో ఉడాయింపు



మోసపోయిన పొదుపు మహిళ

సంగం, అక్టోబరు 1: స్థానిక కెనరా బ్యాంకు వద్ద గుర్తుతెలియని ఇద్దరు యువకులు మంగళవారం పొదుపు మహిళకు టోకరా వేసి రూ. 16 వేలతో ఉడాయించారు. సేకరించిన వివరాల మేరకు, మండలంలోని దాసరిపాళెంలో సుగుణమ్మ స్థానిక పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంది. ఈ సంఘం ఖాతా సంగంలోని కెనరా బ్యాంకులో ఉంది. ఆ సంఘంలోని సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున పదిమందికి రూ. 5 లక్షల రుణం మంజూరైంది. ఆ రుణాన్ని బ్యాంకు అధికారులు రూ. 50 వేల చొప్పున వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ మేరకు సంఘంలోని సభ్యులంతా మంగళవారం బ్యాంకుకు వచ్చి నగదు డ్రా చేసుకున్నారు. వారితోపాటే సుగుణమ్మ కూడా నగదు డ్రా చేసింది. బ్యాంకు నుంచి బయటకు వచ్చి నగదు లెక్కిస్తుండగా, అక్కడే ఉన్న ఇద్దరు యువకులు గమనించి డబ్బులు తక్కువగా ఉన్నట్లున్నాయి, లెక్కిస్తామని చెప్పారు. వారి మాటలు నమ్మిన సుగుణమ్మ రూ. 50 వేలను వారికి ఇచ్చింది. వారు లెక్కించి సరిపోయాని చెప్పి ఆమె చేతిలో పెట్టి దూరంగా ఉన్న మోటారు బైక్ ఎక్కి ముంబై జాతీయ రహదారి వైపు వెళ్లారు. వారిచ్చిన నగదును ఆమె మళ్లీ లెక్కించగా రూ. 34 వేలే ఉన్నాయి. గుర్తుతెలియని యువకులు రూ. 16 వేలు నొక్కేసినట్లు ఆమె గుర్తించారు. ఈ విషయాన్ని బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సీసీ ఫుటేజీలను పరిశీలించగా, వారు నగదు లెక్కించి అందులో కొంత జేబులో పెట్టుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మోసపోయిన మహిళతోపాటు, బ్యాంకు అధికారులు తెలిపారు. సీసీ ఫుటేజ్‌ని బాధితురాలు తీసుకునేందుకు బ్యాంకు అధికారులు అనుమతించలేదు.సీసీ ఫుటేజ్ వివరాలను పోలీసులకు అందచేస్తామన్నారు.

ఆవు దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

సీతారామపురం, అక్టోబరు 1 : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గత నెల 19వ తేదీన ఆవు దాడిలో తీవ్రంగా గాయపడిన షేక్ ఫక్రుద్దీన్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల గ్రామస్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

చేజర్ల, అక్టోబరు 1: తమిళనాడులోని మదురై వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో చేజర్ల మండలం బోడిపాడుకి చెందిన చందు (20) అనే బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. గ్రామస్థుల కథనం మేరకు, బోడిపాడుకి చెందిన చందు మదురైలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్నేహితుడితో కలసి బైక్‌పై వెళుతుండగా కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న బంధువులు మంగళవారం మదురైకి తరలి వెళ్లారు.

బెల్టు దుకాణాలపై పోలీసుల దాడి

● 151 మద్యం సీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలు, నిర్వాహకులతో పోలీసులు

మనుబోలు, అక్టోబరు 1: మండ లంలోని మడమనూరు లోని అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాలుగు బెల్టు దుకాణాలపై సోమవారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ రాకేష్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నిర్వా హకులు రామచంద్రయ్య వద్ద 48, పందెం నరసయ్య వద్ద 32, సుధాకర్ వద్ద 46, నెమలి కుమారి వద్ద 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిర్వాహకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జలదంకిలో 31 మద్యం సీసాలు..

జలదంకి, అక్టోబర్ 1: స్థానిక కల్యాణ మండపం స మీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మోతుపల్లి కోటయ్యను మంగళవారం సాయంత్రం ఎస్‌ఐ లతీఫున్నీసా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 31 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పెత్తందారులు ఎక్కువయ్యారు

● కార్పొరేషన్ ఎదుట కార్మికుల ఆందోళన



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 1 : నగరంలో పారిశుధ్య కార్మికులపై పెత్తనం చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉందని, తద్వారా కార్మికులపై పనిభారం పెరుగుతోందంటూ పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, కిన్నెర కుమార్ మాట్లాడుతూ పని చేసే కార్మికులపై ఎవరి పెత్తనం అవసరం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మిక కుటుంబాలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా మారుతున్నందున కార్మికులందరికీ బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండమ్మ, సునీల్, దేశమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



షేక్ షరీఫ్ (ఫైల్)

కోవూరు, అక్టోబరు 1 : మండలంలోని పడుగుపాడు మసీదు వీధి ప్రాంతానికి చెందిన షేక్ షరీఫ్(22) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల మేరకు.. భార్య, ఇద్దరు పిల్లలతోపాటు తన తల్లితో కలసి జీవనం సాగిస్తున్న షరీఫ్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో తలుపు వేసుకుని సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి తల్లి షేక్ షకీలా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	121
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	244
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7277
వెండి కిలో ధర	రూ. 92,600
వెండి ఒక గ్రాము	రూ. 95.60

జగనన్న లేఅవుట్లలో


అవినీతి కంపు!

● కాంట్రాక్టర్లు, నాయకులు, అధికారుల కుమ్మక్కు

● ఇళ్లు పూర్తిగా నిర్మించకనే బిల్లులు, స్టీలు, సిమెంటు స్వాహా

● నాణ్యత పేరుతో లబ్ధిదారుల నుంచి నిధుల వసూలు

● మొండి గోడలతో దిష్టిబొమ్మల్లా దర్శనం



దామరమడుగు జగనన్న లేఅవుట్లో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 1: ఆర్భాటంగా పేదలందరికీ ఇళ్ల కట్టిస్తామన్న గత వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరలేదు గానీ ప్రజాధనంతో పాటు లబ్ధిదారులను కూడా దోచుకుతిన్నారు. ఏ లేఅవుట్లో పరిశీలించిన అవినీతి కంపు కొడుతోంది. కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై ఇళ్ల పూర్తిగా నిర్మించకనే బిల్లులు, స్టీలు, సిమెంటు స్వాహా చేశారు. ఇది సరిపోదన్నట్లు నాణ్యత పేరుతో ఒక్కో లబ్ధిదారుడి వద్ద రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి పత్తా లేకుండా పోయారు. జరిగిన నిర్మాణ పనులు కూడా నాసిరకంగా జరిగాయన్న ఆరోపణలున్నాయి. దీంతో మొండి గోడలతో దిష్టిబొమ్మల్లా దర్శనం ఇస్తున్న ఇళ్లను చూసి లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో 8, మండలంలో 13 జగనన్న లేఅవుట్లు వేశారు. అందులో నగర పంచాయతీ పరిధిలో 1,129, గ్రామీణ ప్రాంతాల్లో 167 ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టర్లకు అప్పగించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు బుచ్చి నగర పంచాయతీతోపాటు దామరమడుగు, రేబాల, కాళయకాగొల్లు తదితర గ్రామాల్లో గడిచిన 4 ఏళ్లలో ఇళ్ల పూర్తి స్థాయిలో నిర్మించకనే నిర్మించిన దశకంటే ఒక దశ అదనంగా నిర్మించినట్లు చూపి బిల్లులు, స్టీలు, సిమెంటు స్వాహా చేసేశారు. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణాలు కొన్ని పునాదులు, ప్లింత్ బీములు, శ్లాబ్ లెవల్ దశలలో అసంపూర్తిగా మారాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ ఆదేశాలతో పేదల ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పరిశీలించి సంబంధిత అధికారులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినా నేటికీ ఆదిశగా చర్యలు తీసుకోలేదు. పలు దశల్లో ఆగి ఉన్న ఇళ్ల 2025 మార్చి నాటికి పూర్తి చేయకుంటే ఆ లబ్ధిదారులకు మళ్లీ ఇల్లు, బిల్లులు మంజూరు కావు. దీంతో లబ్ధిదారుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారనుంది. ప్రభుత్వం సొంత స్థలం, సొంతిల్లు ఇచ్చిందనే ఆనందం కన్నా అప్పులు మిగిలాయని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. దామరమడుగులో సుమారు 100 ఇళ్ల నిర్మాణం సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించగా ఆ కాంట్రాక్టర్‌కు నిర్మించిన దశ కంటే అదనంగా నిర్మించినట్లు అధికారులు రికార్డులు నమోదు చేసి సిమెంటు, స్టీలు, బిల్లులు చెల్లించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



ఓ ఇంట్లో పగుళ్లిచ్చి కుంగిన దళం

నిలువునా ముంచారు

సొంతిల్లు వచ్చిందని సంతోషిస్తే వరదల పేరుతో కాంట్రాక్టర్ మమ్మల్ని నిలువునా ముంచాడు. ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు సొంత నిధులు కూడా ఇచ్చాం. ఇల్లు పూర్తిగా నిర్మించకుండా వదిలేశాడు. చివరకు అప్పుల పాలయ్యాం. అద్దింట్లో అద్దె చెల్లించలేక జగనన్న లేఔట్లో అరకొర నిర్మాణం జరిగిన ఇంట్లో ఉంటే ఇక్కడ రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు వసతులు లేవు. రాత్రైతే చిమ్మచీకటి, విష సర్పాలతో అల్లాడుతున్నాం.

- కర్లగుంట సుబ్బమ్మ

● **నాసిరకం నిర్మాణాలు**

కాంట్రాక్టర్లు చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించి నాసిరకంగా ఉన్నాయి. సిమెంటు రాళ్లతో కట్టిన గోడలు దెబ్బతిని శ్లాబు వేస్తే కూలే స్థితిలో ఉన్నాయి. ఓ ఇంట్లో వేసిన దళం పగుళ్లిచ్చి కుంగిపోయింది. దీనిని చూసిన ఇంటి లబ్ధిదారుడు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

డబ్బులు తీసుకుని కూడా ఇల్లు పూర్తి చేయలేదు

ప్రభుత్వం ఇచ్చిన నిధులు, స్టీలు, సిమెంటుతో పాటు తాము రూ.70వేలు ఇచ్చినా ఇంటికి శ్లాబు పోయకుండా కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో ఉన్న కొద్ది స్థలంలో రేకులు వేసుకుని కాపురం వెళ్లదీస్తున్నాం. మాగురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎలాంటి మౌలిక వసతులు లేక, రేయింబవళ్ల అవస్థలు పడుతున్నాం. దీంతో పాటు చికటి పడితే విషసర్పాల భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నాం.

- కర్లగుంట లక్ష్మీ, దామరమడుగు

పనులు పూర్తి చేయకుంటే బిల్లులు రికవరీ చేస్తాం

తాను బుచ్చి ఏఈగా బాధ్యతలు చేపట్టే నాటికే ఈ బిల్లులు చెల్లించి ఉన్నారు. కాంట్రాక్టర్లు తిరిగి నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తున్నాం. బిల్లులు, నగదు తీసుకున్న వరకు నిర్మాణాలు పూర్తి చేయకుంటే అందుకు సంబంధించి చెల్లించిన బిల్లులు రికవరీ చేస్తాం.

- పెంచలయ్య, హౌసింగ్ ఏఈ

కసుమూరులో భక్తుల కోలాహలం

● ముగిసిన గంధమహోత్సవం ● కనులపండుగా చిన్న గంధం ఊరేగింపు



చిన్న గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న దర్గా ముజావర్లు

వెంకటాచలం, అక్టోబరు 1 : దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలి 247వ గంధమహోత్సవం ముగిసింది. చివరిరోజైన మంగళవారం చిన్న గంధం (తహలీల్ ఫాతేహ) అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులతో కసుమూరు కోలాహలంగా మారింది. చిన్న గంధం చందన్ మహల్ నుంచి మంగళవాయిద్యాలు, ఫకీర్ల జర్రబ్ (విన్యాసాలు), వివిధ రకాల మేళతాళాల నడుమ మంగళవారం ఉదయం ఊరేగింపుగా బయలుదేరి మధ్యాహ్నం దర్గాకు చేరుకుంది. ఈ సందర్భంగా దర్గాను ప్రత్యేక పూలతో అలంకరించారు. ఊరేగింపుగా వచ్చిన గంధాన్ని కడప పీఠాధిపతి అరిఫుల్లా హుస్సేనీ ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత మస్తాన్ స్వామి సమాధికి గంధం లేపాన్ని పూశారు. అనంతరం దర్గా ముజావర్లకు గంధం బిందేను అందజేశారు. గంధమహోత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం దర్గా ముజావర్లు భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. చివరి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పోతుగుంట సుబ్బారావు, ఎస్‌ఐ అంజనేయులు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్, దర్గా వక్ఫ్‌బోర్డు అధికారి పఠాన్ అస్లాం ఖాన్, వివిధ శాఖల అధికారులు పర్యవేక్షించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీ బస్సుల కంటే కార్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో వచ్చారు. కాగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భక్తుల సంఖ్య కొంత మేరకు పెరిగింది. గంధమహోత్సవం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫతేహ

● ముగిసిన పేట దర్గా గంధోత్సవం



తహలీల్ ఫతేహ చేస్తున్న మాజీ ముతవల్లి హఫీజ్ పాషా

ఏఎస్‌పేట,అక్టోబరు1: సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 251వ గంధ మహోత్సవం మంగళవారం తహలీల్ ఫతేహతో ముగిసింది. ఈ సందర్భంగా దర్గా ఈవో మహమ్మద్ హుసేన్, మాజీ ముతవల్లి హఫీజ్ పాషా ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఖురాన్‌ను పఠించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.భక్తులకు ప్రసాదలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఇస్కపల్లి వాసి



దర్శిగుంట వాసును అభినందిస్తున్న తోరం రాజా, సూర్య వేణులు

అల్లూరు, అక్టోబరు 1: ఆంధ్రప్రదేశ్ తెలుగు ఫిల్మ్ డాన్సర్స్ అండ్ డాన్స్ మాస్టర్స్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఇస్కపల్లి దర్శిగుంట వాసు ఎంపికైనట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సకల కళాకారుడి రాష్ట్ర అధ్యక్షుడు తోరం రాజా, డాన్స్ మాస్టర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్య వేణుల ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలో తనను ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన సందర్భంగా సోమవారం రాత్రి గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను అభినందించినట్లు తెలిపారు. నెల్లూరు జిల్లావాసిగా తనకు ఈ గుర్తింపు రావడం వెనుక తాను ఎంతో కృషి ఉందన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

● అధికారుల సమీక్షలో జేసీ కార్తిక్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తిక్

నెల్లూరు (హరనాథపు రం), సెప్టెంబరు 1 : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తిక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో పౌరసరఫరాలశాఖ, వ్యవసా య, మార్కెటింగ్, రవాణా, ఎఫ్‌సీఐ, రైతు ఉత్పత్తిదారుల సంస్థల అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 1.29 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ నివేదిక ఇచ్చిందన్నారు. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువ ధరకు విక్రయించే దుస్థితి ఏ ఒక్క రైతుకూ రాకుండా అన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

సోమశిలలో 53.667 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, అక్టోబరు 1: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 6,116 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా, 53.667 టీఎంసీలుగా నమోదైంది. దిగువ డెల్టాకు 1000, కండలేరుకు 10,000, ఉత్తర 540, దక్షిణ కాలువలకు 5 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), అక్టోబరు 1 : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బందిని పొరుగుసేవల ప్రాతిపదికన ఏడాది కాలానికి భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ సీహెచ్ ఉషారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీలు 15, సీజీటీలు 6, పార్ట్‌టైమ్ టీచర్స్ 7, అకౌంటెంట్ 1 కలిపి మొత్తం 29 పోస్టులున్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా రూ.250 దరఖాస్తు రుసుం చెల్లించి ఈనెల 10వతేదీ లోపల దరఖాస్తు చేసు కోవాలన్నారు. ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు వయోపరిమితి 18-42 సంవత్సరాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగినులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందన్నారు. వివరాలకు 7075039990, 7075159996 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆటోడ్రైవ ర్లపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు నగరంలోని అయ్యప్పగుడి సెంటర్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీటీసీ చందర్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు వోలా, ర్యాపిడో వంటి యాప్‌లలో తక్కువ బాడుగకు ప్రయాణికులతో బాడుగ మాట్లాడుకొని గమ్యస్థానంలో దింపే సమయంలో అధిక నగదు వసూలు చేస్తున్నారన్నారు. ఆటోలో డ్రైవర్ పక్కన మరొ కరిని ఎక్కించుకుంటున్నారంటూ ఫిర్యాదులు అందాయని చెప్పారు. నిబంధనలు పాటించాలని, ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు పాల్గొన్నారు.సోము రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాపు విద్యార్థుల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం): జిల్లాలోని కాపు, బలిజ విద్యార్థులకు ఆర్థిక పురస్కారాలు అందజే యనున్నట్లు కాపు, బలిజ హెల్పింగ్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు కమతం సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు దుద్దుకూరు శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో 10వతరగతిలో 550కిపైగా మార్కులు సాధించిన పేద విద్యార్థులకు, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఈ నగదు పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 15వతేదీలోగా విద్యార్థులు వారి దరఖాస్తులను 94405 10891 నెంబరు ద్వారా పంపాలని కోరారు.

టెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్ర పరిశీలకులు నాగేశ్వరరావు ● విట్స్ పరీక్ష కేంద్రం సందర్శన



ఏర్పాట్లపై సూచనలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

కావలి, అక్టోబరు1: ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలను (టెట్) డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రగడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పరిశీలకులు నాగేశ్వరరావు (డైరెక్టర్ ఏపీ ఓపన్‌స్కూల్ గుంటూరు) తెలిపారు. మంగళవారం ఆయన కావలి విట్స్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, టాయిలెట్ సౌకర్యం, విద్యుత్, మెడికల్ సౌకర్యాలతో పాటు భద్రత తదితర విషయాలపై అధికారులతో మాట్లాడారు. అభ్యర్థుల హాల్‌టిక్కెట్లలో ఏవైనా తప్పిదాలు ఉన్నచో సరైన ధ్రువపత్రాలు పొంది వాటిని సరిచేయాలన్నారు. ఆ వివరాలను రోజువారీగా జిల్లా కేంద్రానికి తెలియజేయాలన్నారు. పరీక్షల అనంతరం చివరి రోజు సరిచేసిన నామినల్ రోల్స్‌ను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఆయన వెంట కావలి ఉపవిద్యాశాఖ అధికారి రఘురామయ్య, మండల విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

నెల్లూరు ఏఎంసీ ఛైర్మన్‌గా మనుబోలు శ్రీధర్‌రెడ్డి



శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 1 : నెల్లూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా రూరల్లోని పెద్దచెరుకూరు ప్రాంతానికి చెందిన మనుబోలు శ్రీధర్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైంది. శ్రీధర్‌రెడ్డి తండ్రి శేషారెడ్డి, అన్న రామ్మోహన్‌రెడ్డి సీనియర్ రాజకీయ నేతలు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఈ కుటుంబం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజయానికి కష్టపడి పని చేసింది. రైతు కుటుంబం కూడా కావడంతో నెల్లూరు ఏఎంసీ ఛైర్మన్ పదవికి శ్రీధర్‌రెడ్డి పేరును ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి దాదాపుగా ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పదవికి ఎంతో మంది పోటీ పడుతుండగా, పార్టీకి విధేయులుగా పని చేసిన మనుబోలు కుటుంబానికి కేటాయించారు. కొత్త, పాత టీడీపీ నాయకత్వాన్ని ఒక తాటిపైకి తీసుకువచ్చేందుకు తాజా నామినేటెడ్ పదవులు దోహదపడుతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

4న వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం, అక్టోబరు 1 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఈనెల 4వ తేదీన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఇంటర్ (పాస్/ఫెయిల్), ఏదైనా డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పునాదుల్లోనే జగనన్న కాలనీలు

వలేటివారిపాలెం, అక్టోబరు 1: వైసీపీ ప్రభుత్వం హయాంలో మండలంలో 698మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వెంటనే పనులు ప్రారంభించాలని అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిదులు హడావుడి చేశారు. లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, కొన్నిచోట్ల శ్మశానాల సమీపంలో లేఅవుట్లు వేయడంతో చాలామంది లబ్ధిదారులకు పనులు ప్రారంభించడానికి ముందుకు రాలేదు. వీటిలో ఇప్పటికీ 14 ఇళ్ల నిర్మాణాల పనులు మాత్రమే పూర్తయ్యాయి. 48ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన 576 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు.

కాలనీల్లో సమస్యలు కోకొల్లలు

జగనన్న కాలనీల మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. చాలా లేఅవుట్లలో ఇప్పటివరకు రోడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవాలంటే మూడు అడుగులకు పైగానే మెరక తోలాల్సి ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా చెరువులుగా మారుతున్నాయి. స్థలాల వద్దకు రోడ్డుపై నుంచి మెటీరియల్ తెచ్చుకునే పరిస్థితి లేదు. విద్యుత్, నీటి వసతి లేదు.

లబ్ధిదారులకు ఒత్తిళ్లు, బెదిరింపులు

అప్పట్లో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని బాగా ఒత్తిళ్లు వచ్చాయి. ఇళ్లు నిర్మించుకోకుంటే ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తామని, ఒత్తిళ్లు బెదిరింపులు వచ్చాయి. మొదటగా ప్రభుత్వమే ఇళ్లు కట్టిస్తామని చెప్పింది. తదనంతరం ప్రభుత్వం వెనకడుగు వేసింది. లబ్ధిదారులే కట్టుకుంటే అందుకు అవసరమైన మెటీరియల్ అందజేస్తామని చెప్పింది. అంగీకారం పత్రంపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సంతకాలు చేయించారు. పట్టా తీసుకున్న వెంటనే శంకుస్థాపన చేసి ఇళ్లు నిర్మించుకోవాలని లేదంటే రద్దు చేస్తామని బెదిరింపులకు దిగారు. చేసేదేమి లేక కొంతమంది ప్రారంభించారు. పెరిగిన ధరలు, ఎక్కడో ఊరికి దూరంగా, తక్కువ స్థలంలో ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రాలేదు. 80 నుంచి 90 శాతం వరకూ ఇళ్లకు పునాదులే పడలేదు. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వలేటివారిపాలెంలో పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన ఇళ్లు

అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళం

వింజమూరు, అక్టోబరు 1 : పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు నెలరోజుల్లో అయ్యే ఖర్చును మంగళవారం చాకలకొండ గ్రామవాసులు కాకర్ల చారిటబుల్ ఛైర్మన్ కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులకు చెక్కు అందజేశారు. దాతలు ఎవరైనా సహాయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంగటి రఘునాధరెడ్డి, గూడా నరసారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, దంతులూరు వెంకటేశ్వర్లు, వేము లపాటి మాల్యాద్రి, కునాల వెంకటేశ్వర్లు, కాకర్ల హుస్సేన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కాకర్ల దంపతులకు చెక్కు అందజేస్తున్న చాకలికొండ గ్రామస్థులు

స్వచ్ఛమైన నీరు అందేలా చూడాలి

● రాళ్లపాడు ప్రాజెక్టును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం



ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

లింగసముద్రం, అక్టోబరు 1: రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పని చేసే మూడు భారీ మంచినీటి పథకాల నుంచి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కోరారు. మంగళవారం ఆయన రాళ్లపాడు పరిరక్షణ సమితి అధ్యక్షుడు కాకుమాను మాధవరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఇతర రైతులతో కలిసి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను పరిశీలించారు. అనంతరం వారు ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించారు. కాలువల్లో చెట్లు, పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సోమశిల నీటిని ప్రాజెక్టుకు రప్పించేందుకు ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్‌లు చర్యలు తీసుకోవాలన్నారు.

దేశవ్యాప్త కులగణన సర్వే చేపట్టాలి

కందుకూరు, అక్టోబరు 1: దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 6న కందుకూరు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న రౌండ్ టేబుల్ సమావేశ పోస్టర్‌ను స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. బీహార్‌లో కులగణన సందర్భంగా ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో అగ్రకులాలు, సంపన్నులు, ఎస్సీ ఎస్టీ బీసీల మధ్య ఉన్న ఆర్థిక వ్యత్యాసాలు విద్య, ఉద్యోగాలలో ఉన్న వ్యత్యాసం తదితర అంశాలు స్పష్టంగా గణాంకాలతో బయటకు వచ్చాయని పేర్కొన్నారు. అందుకే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి సామాజిక, ఆర్థిక అంతరాలను బహిర్గతం చేయాలన్న డిమాండ్‌తోనే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్, సీఎస్ సాగర్, హరిబాబు, ఎల్. బ్రహ్మయ్య, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, అయ్యన్న, జాన్, శివ పాల్గొన్నారు.

అభివృద్ధిపై మండలాల వారీగా సమీక్షలు

కందుకూరు, అక్టోబరు 1: గ్రామ పంచాయతీలకు విడుదలైన ఆర్థిక సంఘం నిధులు, ఇతరత్రా నిధుల వివరాలతో పాటు ఇటీవల గ్రామసభల్లో తీర్మానించిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మండలాల వారీ సమీక్షనిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ముఖ్యంగా ప్రతిగ్రామంలో విధిగా పారిశుధ్య కార్యక్రమం చేపట్టడంతో పాటు తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయటం కోసం ఈ సమీక్షలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తయిన వెంటనే మండలాలవారీగా సమీక్షలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కలిగిరి, అక్టోబరు 1: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఎస్‌ఐ ఉమాశంకర్ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజంలో జరిగే అన్యాయాలు, అకృత్యాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలన్నారు. ట్రాఫిక్‌రూల్స్, వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని తెలియజేయాలన్నారు. కోడిపందేలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లపై నిఘా ఉంచాలన్నారు. ఆన్‌లైన్ గేమింగ్స్, సోషల్‌మీడియాలో అభ్యంతకర పోస్టులు తదితర విషయాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు 108వాహనానికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసుశాఖ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవుల్లో ఇంటి వద్దే ఉండాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 1: దసరా సెలవుల్లో విద్యార్థులు నీటి గుంటల వద్దకు వెళ్లకుండా, ఎండలో తిరగకుండా ఇంటిపట్టునే ఉండాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీసీ కాలనీ తెలుగు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన, అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీలో రికార్డుల పరిశీలన

ఉదయగిరి రూరల్, అక్టోబరు 1: స్థానిక సబ్ ట్రెజరీలో మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఖజానాధికారి గంగాద్రి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పింఛన్లు, అడ్మినిస్ట్రేషన్‌ల రికార్డులు పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే పింఛన్‌దారులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీవో సీహెచ్ మమత, సీనియర్ అకౌంటెంట్‌లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్, ఆడిట్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ, గంగమ్మల మాన్యం ఏమైనట్టు?

చిట్రగుంట, అక్టోబరు 1: పోలేరమ్మ, గంగమ్మల ఆలయాల మాన్యం భూములు ఏమైపోయినట్లు మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు చెప్పాలని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు ప్రశ్నించారు. మంగళవారం ఆయన బోగోలు వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను నాగులవరం సొసైటీలో అవినీతికి పాల్పడినట్లు రుజువు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం వెనుక 28 ఎకరాల్లో బినామీ పేర్లతో రూ.10లక్షలు తీసుకునట్లు అభియోగం చేశారని, భూమి సర్వే నంబరు, వివరాలు చెప్పగలరా అన్నారు. గ్రావెల్ తొవ్వకాల్లో పర్సంటేజ్ తీసుకున్నాని, కొండబిట్రగుంటలో అమరాబచ్చు ట్రస్ట్ నిర్వాహకుల భవన నిర్మాణంలో పాలకమండలి చెర్మన్ ఇబ్బంది పెట్టినట్లు చేసిన అభియోగం నిజంకాదన్నారు.

మూఢ నమ్మకాలను పారదోలాలి

లింగసముద్రం, అక్టోబరు 1: మూఢ నమ్మకాలను పారదోలి ప్రజల విజ్ఞానాభివృద్ధికి తోడ్పాటు అందించాలని జన విజ్ఞానవేదిక లక్ష్యమని లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాధవరావు తెలిపారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎం మాధవరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, మహేంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం

వలేటివారిపాలెం, అక్టోబరు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని నెల్లూరు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని చిన్నపాలెంలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: రాష్ట్రంలో పింఛన్లు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర తెలిపారు. క్రాకుటూరులో సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పంపిణీ చేశారు. గోగుల హరిబాబు, బాపనపల్లి రాజా, పెనుమల్లి మదన్ పాల్గొన్నారు.

ఏఎస్ పేట : మండలంలో పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తయిందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 4976 మందికి పెన్షన్లు అందచేశామన్నారు. మిగతావారికి బుధవారం అందచేస్తామన్నారు.

వరికుంటపాడు : జీ.కొండారెడ్డిపల్లి, వరికుంటపాడు, కనియంపాడు, పెద్దిరెడ్డిపల్లిలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఎంపీడీవో మల్లికార్జున పరిశీలించారు. 24 పంచాయతీల పరిధిలో మొత్తం 4,256 మందికిగానూ 4030 మందికి పెన్షన్లు పంపిణీ చేశామన్నారు.

పోలినేనిపాలెంలో గాంధీ జయంతి వేడుకలు

వలేటివారిపాలెం, అక్టోబరు 1: పోలినేనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు మహాత్మగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. సీడీపీఓ శర్మిష్ట, ఎంఈఓ-2 మల్లికార్జునరావులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, హెచ్‌ఎం సామ్యూల్, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణకుమారి పాల్గొన్నారు.

అంధకారంలో అంకభూపాలపురం ఎస్సీ కాలనీ

వలేటివారిపాలెం, అక్టోబరు 1: పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అంకభూపాలపురం ఎస్సీ కాలనీలో 20రోజులుగా అంధకారం నెలకొంది. వీధిలైట్లు ఉన్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ సమస్యతో రాత్రి స్థానికులు అంధకారంలో కాలం వెల్లదీస్తున్నారు. సమస్యను పంచాయతీ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటి కైనా పాలకులు, అధికారులు స్పందించి వీదిలైట్ల మర మ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌ఎస్‌ఆర్‌లో ఫ్రెషర్స్ డే

బిట్రగుంట, అక్టోబరు 1: కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు వేర్వేరుగా చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, హెచ్‌అండ్‌ఎస్ హెడీవో లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

కావలి, అక్టోబరు 1: జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో మంగళవారం శ్రీచైతన్యకళాశాల విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ వీవీ సాయితేజ ఆధ్వర్యంలో 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ రవిప్రకాష్, కళాశాల డైరెక్టర్ జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: మహాత్మాగాంధీ జయంతి వేడుకలో భాగంగా పట్టణంలోని పెద్దబజారులో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గాంధీ విగ్రహా కార్య నిర్వాహకులు నల్లమల్లి వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి వరదరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకోవటం లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న శిబిరంలో యువతీయువకులు పాల్గొనాలని కోరారు.

ప్లేట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ

కందుకూరు, అక్టోబరు 1: మాల్యాద్రి, మాచవరం యానాది కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మేక్ ఏ చేంజ్ సొసైటీ సభ్యులు మంగళవారం ప్లేట్లు, వాటర్‌బాటిల్స్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. గౌతమ్ శివతేజ మిత్ర బృందం సభ్యులు పదేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో గౌతమ్ శివతేజతో పాటు చక్కా వెంకటేశ్వరావు, రవ్వా శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ, ఎస్. చిరంజీవి, నాగేంద్రబాబు, హెచ్‌ఎం ఏవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

అనంతసాగరం, అక్టోబరు 1: అగ్రహారం టీడీపీ నాయకుడు కాసా రమణారెడ్డి (55) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని నేతలు కాసా సుబ్బారెడ్డి, పెద్ద సూరారెడ్డి సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు.

మర్రిగుంటలో సమస్యల పరిశీలన

కొండాపురం, అక్టోబరు 1: మర్రిగుంట పంచాయతీలో నెలకొన్న సమస్యలపై టీడీపీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం, జిల్లా రైతు కార్యదర్శి పోలినేని రమేష్‌లు మంగళవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. వైసీపీ మద్దతుదారుడు సర్పంచ్ దార్ల గోపి టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పలువురు నాయకులు ఎమ్మెల్యే కాకర్లకు తెలియజేశారు. ఆమేరకు పరిశీలనకు వచ్చినట్లు నాయకులు తెలిపారు. వారి వెంట నేతలు చిట్టాబత్తిన మాచర్ల, తిరుపతిరెడ్డి ఉన్నారు.

కరేడు విద్యార్థులకు అభినందన



ఉలవపాడు, అక్టోబరు 1: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ పోటీలకు ఎంపికైన కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 6గురు విద్యార్థులను మంగళవారం పాఠశాలలో అభినందినట్లు ప్రధానోపాధ్యాయులు పన్నూరు శ్రీనివాసులు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-19 విభాగంలో సోమవారం వారు ప్రతిభ చూపారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటి ఛైర్మన్ బాలేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే 'పొలం పిలుస్తోంది'

కందుకూరు, అక్టోబరు 1: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే ప్రభుత్వం పొలం పిలుస్తోంది పేరుతో కార్యక్రమం చేపట్టిందని కందుకూరు సబ్ డివిజన్ ఏడీఏ పి. అనసూయ తెలిపారు. మోపాడు, మాచవరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతివారంలో రెండురోజులు గ్రామాలకే అధికారులు వచ్చి సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు. త్వరలోనే అన్ని పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సబ్సిడీతో వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్‌లు అందిస్తున్నట్లు రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి బ్రహ్మసాయి కోరారు. గొర్రెలు, మేకల పోషకులకు కేంద్రం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద 50శాతం రాయితీతో రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు మాచవరం పశువైద్యాధికారి చెన్నకేశవులు తెలిపారు. గింజదశలో ఉన్న వరి పొలాలను పరిశీలించి రైతులకు చీడపీడల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాము, అధికారులు షేక్ ఖాసిం, సిహెచ్ వెంకటరాజ, రమణయ్య, సీహెచ్ రోనీరేచల్ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటింస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. శింగమనేనిపల్లె, నేకునాంపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు. పంటలసాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగసముద్రం: కౌలు రైతులందరూ సీసీఆర్‌సీ కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి అబ్రహంలింకన్ తెలిపారు. మంగళవారం వీఆర్ కోటలోని రైతు సేవా కేంద్రంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ ఈ-పంట నమోదు, భూసార పరీక్షలు గురించి వివరించారు. పశుసంవర్ధక శాఖ, పశువులకు టీకాలు, ఉద్యానశాఖలో ఫారంపాండ్స్, డ్రిప్ ఇరిగేషన్ గురించి ఆయా శాఖల సహాయకులు షేక్ రూఫియా, షేక్ అహమ్మద్‌లు వివరించారు.



కందుకూరు: వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



వీవీ పాలెం :శింగమనేనిపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఏవో హేమంత్ భరత్‌కుమార్

ఉలవపాడు: ఆధునిక పద్ధతిలోని సాగులో మెలకువలు పాటిస్తూ లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి తిరుమజ్యోతి రైతులకు సూచించారు. మంగళవారం వీరేపల్లి, చాకిచర్ల సచివాలయాల పరిధిలోని రైతులకు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు పొందడం ఎలా అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల్లో చీడపీడల నివారణకు ఇష్టానుసారంగా పురుగు మందులు వాడటాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వీరేపల్లి సర్పంచ్ కాకర్లపూడి సుధారాణి, గ్రామ పెద్దలు ఉద్యాన శాఖల సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పంటల సాగులో రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని కొండాయపాళెం, ఉదయగిరిల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: తూర్పుబోయమడగల, గువ్వాడి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారి రవికుమార్ ఆధ్వర్యంలో పంటల సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏలు పవన్‌కుమార్, ఆదిత్య, వెటర్నరీ సహాయకులు బాబూరావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: పొలం పిలుస్తోందిలో భాగంగా మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు మారంరెడ్డిపల్లిలో వరిపైరును సందర్శించారు. కార్యక్రమంలో వీఏ మాలాశ్రీ, మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ చిరంజీవి, వీఏఏలు లక్ష్మీనారాయణ, నరేంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెన్నక్రిష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మారుద్దాం



ర్యాలీలో పాల్గొన్న ఫడ్స్ డైరెక్టర్ రమణయ్య, తదితరులు

లింగసముద్రం, అక్టోబరు 1: ప్లాస్టిక్‌రహిత గ్రామాలుగా మారుద్దామని ప్రతిఒక్కరూ అందుకు కృషి చేయాలని ఫడ్స్ డైరెక్టర్ వీవీ రమణయ్య, ఎస్‌డీఏ డైరెక్టర్ హజరత్తయ్య తెలిపారు. మంగళవారం లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌డీఏ స్వచ్ఛంద సేవా సంస్థ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం మాధవరావు అధ్యక్షతన ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొండయ్య, వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

కావలి: నెహ్రూ యువకేంద్రం, ఒట్టూరు ఆదర్శ పాఠశాల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రియదర్శిని మహిళామండలి ఆధ్వర్యంలో తుమ్మలపెంట బీచ్‌లో స్వచ్ఛతా హి సేవపై అవగాహన కల్పించారు. జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడారు. స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణతోనే స్వచ్ఛగ్రామాలు సాధ్యం అన్నారు.

కావలి టౌన్: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు ప్రాంగణంలో మొక్కలు నాటి మందులు చల్లారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్, ప్రిన్సిపాల్ శేషయ్య, ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కలువాయి: తెలుగురా యపురంలో మంగళవారం స్వచ్ఛత హి సేవ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీ.మురళీకృష్ణ, బీ మస్తాన్‌బాబు, ఆర్‌వీ కృష్ణారెడ్డి, వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శి బీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలపెంట బీచ్‌లో అవగాహన కల్పిస్తున్న నెహ్రూ యువకేంద్రం సభ్యులు

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ వీఎస్‌ఆర్ వైద్యశాల అధినేత డాక్టర్ షకీలా ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలకు రూ.6000లను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. జేవీవీ అధ్యక్షుడు వంటేరు మల్లికార్జున, ప్రధానకార్యదర్శి మురళీకృష్ణ, రెడ్‌క్రాస్ ఛైర్మన్ సాధిక్‌హుస్సేన్, ప్రజానాట్యమండలి కళాకారుడు గద్దర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సంగం : ప్రశంసాపత్రాలతో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు

చేజర్ల : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో స్థానిక లుంబిని విద్యాలయం విద్యార్థులు మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. మొదటి స్థానంలో యు.అనూష, రెండో స్థానంలో ఎం.విష్ణుతేజ, మూడవ స్థానంలో పీ జితేంద్ర నిలిచారు. ఈ సందర్భంగా వారిని కరస్పాండెంట్ బీ రమేష్ అభినందించారు.

సంగం : ఎంపీపీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ఆరు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ, బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో జానకీరామ్, హెచ్‌ఎం బుజ్జయ్య తదితరులుపాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సోమశిల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొత్తం ఆరుగురిని జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, వేము పెంచలయ్య పాపిశెట్టి నరసింహులు, నారాయణరావు, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కావలి టౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. పట్టణ, రూరల్ నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవంలో అతిథులుగా డాక్టర్లు శివప్రసాద్, ఆనంద్‌లు పాల్గొని ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు జానకిరామ్, పట్టణ కార్యదర్శి హరనాద్, సుబ్బరామశర్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



ఉదయగిరి రూరల్ : నగదును ప్రధానోపాధ్యాయుడికి అందజేస్తున్న విద్యార్థులు

హెల్పింగ్ హ్యాండ్స్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 1: విజయవాడ వరద బాధితులకు పుల్లాయపల్లి ప్రాథమికోన్నత విద్యార్థులు రూ.5,267లు సేకరించారు. ఆ నగదును హెచ్‌ఎం సుబ్బారెడ్డికి అందజేశారు. ఉపాధ్యాయులు మరికొంత జోడించి రూ.10వేలను సీఎం సహాయనిధికి పంపనున్నట్లు ఆయన తెలిపారు. హెచ్‌ఎం షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

వింజమూరు : స్థానిక బొమ్మరాజుచెరువు టీడీపీ కార్యాలయంలో అపుస్మా ప్రతినిధులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని కలసి వరద బాధితుల సహాయార్థం సేకరించిన నగదు చెక్కును అందించారు. అపుస్మా ఆధ్వర్యంలో రూ.1,20,000లను దుత్తలూరు సిద్దార్థ పాఠశాల కరస్పాండెంట్ కె.ఉదయశంకర్‌రెడ్డి సేకరించి, ఎమ్మెల్యే కాకర్ల చేతుల మీదుగా అపుస్మా నియోజకవర్గ ప్రెసిడెంట్ కేవీ రత్నం అందించారు. ఈ మొత్తాన్ని నారా లోకేష్‌కి అందిస్తామని ఆయన తెలియజేశారు.

కందుకూరు: నియోజకవర్గంలోని ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ (అపస్మా) సభ్యులు రూ.1.23లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి పంపాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నేలనూతన శ్రీధర్, కోశాధికారి కృష్ణారావులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, సాయిబాబు, శ్రీనివాసులు ఉన్నారు.



విరాళం అందజేస్తున్న కందుకూరు అపస్మా ప్రతినిధులు

మద్యం దుకాణాల మూత

ఉదయగిరి రూరల్, అక్టోబరు 1: పట్టణంలో మంగళవారం మద్యం దుకాణాలు తెరుచుకోలేదు. దీంతో మందుబాబులు దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీ సోమవారంతో ముగిసింది. ప్రస్తుత ప్రభుత్వం కొత్తపాలసీని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది దుకాణాలు తెరిచేందుకు మొండికేశారు. ఎక్సైజ్ అధికారులు సిబ్బంది చర్చలు జరిపి సాయంత్రం ఆరు గంటలకు దుకాణాలు తెరిచే లా చేశారు. దీంతో మందుబాబులు బారులు తీరారు.

సంగం : ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం కొద్దిసేపు మూతపడ్డాయి. సిబ్బంది సమ్మె ప్రారంభించడంతో సమ్మెలో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. మధ్యాహ్నం నుంచి మద్యం దుకాణాలు పనిచేశాయి.



మద్యం దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న మందుబాబులు

ముందస్తు విజయ దశమి వేడుకలు



చేజర్ల : మహిషాసురవధ వేషధారణలో విద్యార్థులు

చేజర్ల, అక్టోబరు 1 : అదురుపల్లి త్రికోటేశ్వర విద్యాలయంలో ముందస్తు విజయదశమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు దుర్గా వేషధారణ, మహిషాసురవధ, రావణ దహన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విజయదశమి గురించి కరస్పాండెంట్ లక్ష్మీనరసారెడ్డి, డైరెక్టరు సుధా కరరెడ్డి, హెచ్‌ఎం కృష్ణ చైతన్య వివరించారు.



వింజమూరు : వివిధ వేషధారణలతో ఉన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంగం : వేడుకలకు స్థానిక గంగమ్మ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మంగళవారం మహిళలు సర్వాంగ సుందరంగా రంగవల్లులను తీర్చిదిద్దారు.

వింజమూరు : పట్టణంలోని రవి ఇంగ్లీష మీడియం హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వివిధ వేషధారణలో అలంకరించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

కార్పొరేటర్ బొబ్బల ఎక్కడ?

● 'ఫోర్జరీ' కేసులో అన్వేషిస్తున్న పోలీసులు

నెల్లూరు(సిటీ): పురపాలక శాఖను కుదిపేసిన ఐఏఎస్ అధికారి సంతకాల ఫోర్జరీ కేసు రాజకీయ వర్గాలను ఉత్కంఠకు గురిచేస్తూనే ఉంది. తాజాగా వైసీపీకి చెందిన కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ ఆ కేసులో భాగస్వామి అయ్యాడంటూ ఆయనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు గాలిస్తున్నట్లు మంగళవారం సోషల్ మీడియాలో ఓ పోస్టు హల్‌చల్ చేసింది. ఈ కేసులో ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తులు కార్పొరేటర్ శ్రీనివాస్ యాదవ్ పేరును ప్రముఖంగా ప్రస్తావించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయనను అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందాలు విస్తృతంగా గాలిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని పోలీసు శాఖ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

చెకుముకి టాలెంట్ టెస్ట్

పొదలకూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సాయిబాబా మందిరంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో విరువూరు జడ్పీ హైస్కూల్, ప్రైవేటు పాఠశాలల్లో శ్రీసాయినాథ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జేవీవీ యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, కళ్యాణ్ తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు
కన్యకాపరమేశ్వరి ఆలయం ముస్తాబు



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 1 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ముస్తాబైంది. ఆలయంతోపాటు పరిసర వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి శేగు షణ్ముఖ రావు, ది నెల్లూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, ఆలయం పాలక మండలి అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో గురువారం నుంచి ప్రతీరోజూ ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, అర్చన, సాయంత్రం పూలంగి సేవ, ప్రత్యేక అలంకరణ జరుగుతాయని సభ్యులు చెప్పారు. గురువారం 1008 మంది మహిళతో పెన్నా నదీ జలాల సంగ్రహణం, కలిశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ కలిశ జలాలతో అమ్మవారికి అభిషేకం చేస్తారన్నారు. అమ్మవారు రోజుకో అలంకరణలో దర్శనమిస్తారని, 9వతేదీ సరస్వతీ అలంకరణ రోజు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం, నాలుకపై బీజాక్షరాలు రాయించడం జరుగుతుందని తెలిపారు. 11వతేదీ మహర్నవమితి నాడు ఉదయం 9గంటలకు కన్యపూజ, గజలక్ష్మీ అలంకారం, సాయంత్రం మహిషాసురమర్థిని అలంకారం, పూలంగిసేవ ఉంటాయన్నారు. 12వతేదీ శనివారం రాత్రి నగరోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

కృష్ణ మందిరంలో...

నగరంలోని మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణ మందిరంలో వైభవలక్ష్మీదేవికి గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని మందిరం కమిటీ అధ్యక్షుడు బీవీ రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ సుబ్బరామరాజు, ధర్మకర్త సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. అమ్మవారికి రోజుకో అలంకరణ జరుగుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు. కాగా, ఈ మందిరంలోని భవానీ శంకరస్వామికి మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా రుద్రాభిషే కాలు జరిగాయి.

వైసీపీ నేత చెరలో ఉన్న
దొరువును కాపాడండి

● టీడీపీ నేతల వినతి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 1 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన దొరువును వైసీపీ నేత చెర నుంచి కాపాడాలని నెల్లిమెట్టకండ్రిగ టీడీపీ నాయకులు మంగళవారం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేత తమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోడూరు రెవెన్యూ బిట్-2 పరిధిలో నెల్లిమెట్ట కండ్రిగలో గ్రామస్థుల అవసరాల ఉపయోగించుకునే సుబ్బన్న దొరువును స్థానిక వైసీపీ నేత (భూస్వామి) తనకు హక్కు ఉందంటూ ఆక్రమించుకుని సంబంధించిన రహదారిని తొలగించినట్లు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 1 : సమాజంలో వృద్ధులను గౌరవించడం మన సంప్రదాయమని పీఎంపీ వైద్యుడు నరసాపురం ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వెంకటేశ్వరపురంలో వృద్ధులను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు సనావుల్లా, దాదాసాహేబ్, సత్తార్, సత్యనారాయణ, జకావుల తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి

● కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 1 : నగరంలోని ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని సచివాలయ సిబ్బందిని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. మంగళవారం నగరంలోని రైల్వేఫీడర్స్‌రోడ్డు, రంగనాయకులపేట, మూలాపేట, గణేష్ ఘాట్, హరనాథపురం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతోందని, తద్వారా పరిసర ప్రాంతవాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థల యజమానులకు తొలుత నోటీసులు జారీ చేసి అనంతరం ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తర్వాత పలు ప్రాంతాల్లో సామాజిక పింఛన్ల పంపిణీలో కమిషనర్ పాల్గొన్నారు. కాగా, నగరంలోని ఇళ్ల నిర్మాణంలో భాగంగా లబ్ధిదారులకు మెప్మా ద్వారా మంజూరైన రుణాలను అందచేసిన కమిషనర్ పొదుపు గ్రూపుల్లో ఉన్న లబ్ధిదారులందరికీ రూ. 35 వేలు అదనపు రుణాలను అందచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెప్మా, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోండి

● డీఏవో సత్యవాణి



ముత్తుకూరు : మట్టి పరీక్షలు చేయిస్తున్న డీఏవో సత్యవాణి

ముత్తుకూరు, అక్టోబరు 1 : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి తెలిపారు. మండలంలోని మామిడిపూడిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మట్టి నమూనా పరీక్షలు, పోషకాల వాడకం అవసరాన్ని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్, శేషగిరిరావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్, ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారిణి జ్యోత్స్నరాణి, వీఏఏ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట, డేవిస్‌పేట గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి డి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు కదురు రాధాకృష్ణారెడ్డి, బొల్లినేని రవినాయుడు, హరిబాబునాయుడు, మల్లికార్జున నాయుడు, డేవిస్‌పేట ఉపసర్పంచ్ తన్నీరు ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎస్.నవీన్, గ్రామ ఉద్యానవన సహాయకుడు వి.మాదయ్య, వెటర్నరీ అసిస్టెంటు సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : మండలంలోని వరిగొండ-1, 2 గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు వ్యవసాయంలో ఆధునిక విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శిరీషారాణి, ఏఈఓ ప్రసన్న, వీఏఏ సుమంత్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతులతో కలిసి పచ్చిరొట్ట విత్తనాలు చల్లిన పొలాన్ని సందర్శించారు.

మనుబోలు : రైతులు ఉద్యాన పంటలు సాగుచేసి అధికలాభాలు గడించవచ్చునని ఉద్యానశాఖాధికారి ఆనంద్ అన్నారు. మండలంలోని జట్లకొండూరు, చెర్లోపల్లి పంచాయతీల్లో వ్యవసాయాధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్ మాట్లాడుతూ వరిసాగులో రసాయిన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జహీర్, ఏఈవో కళారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలని సహాయ వ్యవసాయ సంచాలకులు డి.సుజాత అన్నారు. మండలంలోని దామరమడుగు, రేబాల గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎం.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు డి.అనిత, బి.పవన్‌కుమార్, డి.కీర్తన, వీహెచ్ఏ కే.ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో జనసేన ప్రాయశ్చిత్త దీక్ష

ముత్తుకూరు, అక్టోబరు 1 : ధర్మాన్ని మనం కాపాడితే ఆ ధర్మం మనల్ని కాపాడుతుందని జనసేనా పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తెలిపారు. కప్పలదొరువు కళ్యాణ వేంక టేశ్వరస్వామి ఆలయంలో జనసేన నాయకులు మంగళ వారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. నారాయణ నామ స్మరణ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌నాయుడు మా ట్లాడుతూ తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించిన వారిని దేవుడు కఠినంగా శిక్షించాలనే సంకల్పంతో దీక్ష చేస్తున్నామని చెప్పారు. దీక్షకు టీడీపీ నాయకులు పల్లాల రవి, బొబ్బేపల్లి అంకయ్య, బద్రి మద్దతుగా కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మహిళా విభాగం నాయకురాలు గుమ్మినేని వాణిభవానీ నాయుడు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో శాంతి హోమం



హోమానికి హాజరైన జనసేన నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 1: తిరుమల లడ్డూ కల్తీ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరసామి ఆలయంలో మంగళవారం శాంతి హోమం నిర్వహించారు. నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో ధర్మం కోసం ముందుకు అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు సుందరామిరెడ్డి, లాయర్ శ్రీరామ్, నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చేయని పనులకు రూ.కోట్లలో బిల్లులు

● మండలానికో షాడో లీడర్‌ను పెట్టి దోచుకున్నారు ● మాజీ ఎమ్మెల్యే ప్రసన్నపై ఎమ్మెల్యే ప్రశాంతి ఫైర్
● పింఛన్ పంపిణీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



వవ్వేరులో మంచం పట్టిన రోగికి పింఛను అందజేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 1: అధికారులపై ఒత్తిడి తెచ్చి చెయ్యని పనులకు కూడా కోట్ల రూపాయలు బిల్లులు చేయించుకున్న ఘనుడు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ మండలానికి ఒక షాడో లీడర్‌ను పెట్టి ఇసుక, గ్రావెల్ దందాలు చేయించడంతో పాటు కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు దండుకున్నారని ఆరోపించారు. నీ అవినీతి అక్రమాలపై విచారణ చేయిస్తే నీ అక్రమాల వెనుక ఎవరున్నారు.. ఎక్కడెక్కడ ఎవరు ఎంత తిన్నారు.. అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. అనంతరం ఖాజానగర్‌లో వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో రూ.10లక్షలు విరాళంతో నిర్మించిన మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మసీద్ అభివృద్ధికి రూ. 25వేలు విరాళాన్ని మాజీ ఎంపీటీసీ ఎస్‌కే.పర్వీన్, స్థానిక నాయకుడు బచ్చాబాయ్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నరసింహారావు, నాయకులు హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, హరనాథ్, శివప్రసాద్‌నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, సీహెచ్.శ్రావణ్, సుబ్రమణ్యంనాయుడు, రామానాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కైలాస భూమిలో భవనాల ప్రారంభం



సత్యహరిశ్చంద్రుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు

కోవూరు, అక్టోబరు 1: పట్టణంలోని కైలాస భూమి (శ్మశానం)లో నిర్మించిన భవనాలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మంగళవారం ప్రారంభించారు. మృత్యుంజయ సూపంతో పాటు సత్యహరిశ్చంద్ర విగ్రహాన్ని ఆవిష్కరించారు. భారీ శివుడి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. వేమిరెడ్డి దంపతులు కైలాసభూమి ఆవరణలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ శ్మశానవాటికను అభివృద్ధి చేయడం అభినందనీయమంటూ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూను నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఎంపీపీ తుమ్మల పెంట పార్వతి, సర్పంచు యాకసిరి విజయ, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, ఇంతా మల్లారెడ్డి, ఇండ్ల రాఘవేంద్ర, హరికుమార్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర హోం మంత్రిని కలసిన సత్యంరెడ్డి

విడవలూరు, అక్టోబరు 1: రాష్ట్ర హోంశాఖామంత్రి వంగలపూడి అనితను విడవలూరుకి చెందిన ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి సోమవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన పలు అంశాలపై మంత్రితో చర్చించారు.

చంద్రబాబు పాలన భేష్ : వేనాటి

నెల్లూరు (లీగల్), అక్టోబరు 1 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన బాగుందని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ వరదల్లో సమర్థంగా పనిచేశారన్నారు. న్యాయవాదుల కోసం అమరావతిలో జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన న్యాయ విశ్వవిద్యాల యాన్ని స్థాపించాలని నిర్ణయం తీసుకోవడం, కర్నూలులో హైకోర్టు ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయాలనుకోవడం, యువ న్యాయవాదులకు నెలకు రూ.10వేలు స్టైఫండ్ ఇచ్చేందుకు ముందుకు రావడం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు.

విద్యార్థులకు పోటీలు

విడవలూరు, అక్టోబరు 1: విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలోని విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ముందస్తు వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధి అవకాశాలు అనే అంశంపై వ్యాసరచన, ఏపీలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి చెందిన ప్రాంతాలు అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన మద్యం దుకాణాల గడువు

● ఆందోళనలో వైన్‌షాపుల సిబ్బంది

తోటపల్లిగూడూరు, అక్టోబరు 1 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం నూతన పాలసీ అమలు కానుండడంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది తాము పనిచేసిన కాలానికి వేతనాల చెల్లింపు విషయంలో ఇటు ప్రభుత్వం, అటు ఏజన్సీల ద్వారా స్పష్టమైన హామీ రాకపోవడంతో దుకాణాల సిబ్బంది మంగళవారం కొంత సమయం దుకాణాలను బంద్ చేసి ఆందోళన చేశారు. ఎక్సైజ్ శాఖ ఒత్తిడితో బలవంతంగా తిరిగి సిబ్బంది దుకాణాలను తెరిచి విధుల్లో పాల్గొన్నారు. దుకాణాలు మూసివేయడంతో మద్యానికి అలవాటు పడిన పలువురు ఆయా షాపుల వద్ద దిగాలుగా కనిపించారు. మద్యం దుకాణాల నిర్వహణ ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా స్పష్టమైన హామీ కోసం సిబ్బంది ఎదురుచూస్తున్నారు. అసలే జీతాలలో పీఎఫ్‌లో చాలా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు న్నాయి. వైన్ షాపు సిబ్బంది ఉద్యోగ భద్రత లేకుండా బలవంతంగా పని చేయించడంతో సతమతమవుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సిద్ధం

● ఆత్మీయ సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 1 : ఎన్నికల్లో తనకు మెజార్టీ తెచ్చిపెట్టిన నగరంలోని రెండో డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం 2వ డివిజన్ పరిధిలోని పెద్దచెరు కూరు వద్ద ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీకి జీవనాడైన పోలవరాన్ని చంద్రబాబు పూర్తి చేశారని, దాని ద్వారా అనేక జిల్లాలకు సాగునీరు పారిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అంతర్జాతీయ హంగులతో రాజధాని అమరావతిని నిర్మిస్తారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ రామ్మోహన్‌యాదవ్, నాయకులు మనుబోలు శేషారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చెన్నారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బండి శ్రీకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో మొక్కల పంపిణీ

పొదలకూరు, అక్టోబరు 1 : స్వచ్ఛత హి సేవలో భాగంగా మంగళవారం మండల ప్రజాపరిషత్ ఆవరణలో ఉన్న శిథిలమై వున్న శానిటేషన్ ట్రక్‌కు రంగులు దిద్ది సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నగ్మకుమారి మాట్లాడుతూ ఇది ప్లాంట్ ట్రక్‌గా ఉండబోతోందని, ఇందులో ఎవరైనా మొక్కలు పెట్టి దానం చేయవచ్చన్నారు. ఎవరైనా ఇక్కడ ఉన్న మొక్కలను ఉచితంగా తీసుకెళ్లి నాటుకోవచ్చన్నారు. అప్పటి వరకు మొక్కలను కార్యాలయ సిబ్బంది సంరక్షిస్తుంటారన్నారు. మిగిలిన మొక్కలు అవసరమైన చోట ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ద్వారా నాటుతామన్నారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు.

47వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 1 : నగరంలోని 47వ డివిజన్ మహాలక్ష్మి గుడి, కామాటి వీధిలో దివ్యాంగులకు మంగళవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మ వరం సుబ్బారావు పింఛను అందించారు. ఆయన మాటాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్, కోకిల, మెహర్ నిసా, చాముండేశ్వరి, మునికృష్ణ, కంచి రాధాకృష్ణ, ఆర్కాట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రత్నంలో ముందస్తు దసరా సంబరాలు



దసరా సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 1 : నగరంలోని సరస్వతి నగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బొమ్మల కొలువు ఏర్పాటు చేసి నిర్వహిం చిన సాంస్కృతిక ప్రదర్శ నలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్చరీ పోటీలకు రత్నం విద్యార్థులు..

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు డాక్టర్ 'కిషోర్స్ రత్నం' విద్యార్థులు ఎంపికైనట్లు జీఎం రామ్మూర్తినాయుడు తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అండర్-14 బాలికల కాంపౌండ్ విభాగంలో కే జనని, రికర్వ్ విభాగంలో పీ భావజ్ఞహంసిని, అండర్-17బాలికల ఇండియన్ విభాగంలో పీ కృతిక కిరణ్, ఏ జాన్వీ ఆరాధ్య, బాలుర విభాగంలో ఏ వరుణ్‌రెడ్డి, అండర్-18 బాలికల విభాగంలో కే మోక్ష రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

సైన్స్ ఫలితాలు సామాన్యులకు అందాలి

● జన విజ్ఞాన వేదిక నేత డాక్టర్ రఫీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 1 : శాస్త్ర, సాంకేతిక రంగాలలో సాధిస్తున్న విజయాలు, వాటి ఫలాలు సామాన్యులకు చేరువకావాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక నాయకుడు డాక్టర్ రఫీ అన్నారు. మంగళవారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నగర, మండల స్థాయిలో చెకుముకి ప్రతిభ పోటీలు జరిగాయి. ముందుగా ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజం కోసం జేవీవీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. నగరంలో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది వరకు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారన్నారు. 33 చోట్ల మండల స్థాయిలలో ఒకే దఫా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పరీక్ష అనంత రం జరిగిన ఇంద్రజాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ దయాకర్, డాక్టర్ శ్రీనునాయక్, ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, విజయకుమార్, డాక్టర్ లహరి, డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువత

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 1: జాతీయ బుచ్చిరెడ్డిపాళెం ఎస్ఎస్. కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులు, యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తిరివీధి సుబ్రమణ్యం, సభ్యులు దరిశి బాల నరసింహారావు, మస్తాన్‌బాబు, సరాబు వెంకట నాగేశ్వరరావు, తిరివీధి రాజేంద్రప్రసాద్, తెలనాకుల మురళి, కృష్ణం సురేష్,

యువత రక్తదానానికి ముందుకు రావాలి : డీఎస్పీ

నెల్లూరు రూరల్, అక్టోబరు 1 : నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు మంగళవారం ధనలక్ష్మీపురంలోని జడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటారు. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు క్రీడా దుస్తులు అందచేశారు. విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి గ్రూపులు వెల్లడించారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు విజయ్‌బాస్కర్, సభ్యులు పవన్‌కుమార్‌రెడ్డి, సేవా బ్లడ్ బ్యాంక్ ఏవో భాస్కర్‌నాయుడు, ఏఏఎఫ్ అధినేత మస్తానయ్య, వేణు(బాబీ), కాకుపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశోధన పత్రం సమర్పించిన పీజీ విద్యార్థులు

కొడవలూరు, అక్టోబరు 1 : కొడవలూరు పంచాయతీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో పీజీ విద్యార్థులు ఉమర్, తేజా, సాయిలు ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్నోవేటివ్ రిసెర్చ్ టెక్నాలజీ సంస్థ అంతర్జాతీయ పరిశోధన సంస్థకు డీప్ లర్నింగ్ మెథడ్స్, అప్లికేషన్స్‌పై పరిశోధన పత్రం సమర్పించారు. దీంతో కళాశాల చైర్మన్ డాక్టర్ పీ.గుణశేఖర్ వారిని మంగళవారం అభినందించారు. విద్యార్థులు చదువు, ఆటలతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట కళాశాల సిబ్బంది ఉన్నారు.

నేడు 'భక్తిరంజనీ - భజన మంజరి'

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 1 : నగరంలోని టౌనుహాలులో బుధవారం సాయం త్రం 6 గంటలకు భక్తిరంజనీ - భజన మంజరి కార్యక్రమం జరుగుతుందని గురుకృప సంగీత విద్యాలయం వ్యవస్థాపకురాలు ఏ లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళ వారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు శ్రీత్యాగ రాజ సాంస్కృతిక సభ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. శ్రీగురుకృప సంగీత విద్యాలయం, గానం అకాడమీ, భారతీ సంగీత నృత్య విద్యాలయం విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం జరుగు తుందన్నారు. మంత్రి పొంగూరు నారాయణ, ఆర్డీవో మలోలా, పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు.



తిరుమలలో పవన్

ప్రాయశ్చిత్త దీక్ష విరమణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అలిపిరి నడకమార్గం గుండా మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం స్వామిని దర్శించుకుని, దీక్ష విరమించనున్నారు.

సామాన్య భక్తులకే పెద్దపీట



'ప్రస్తుతమున్న ఉన్నతాధికారులందరం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కొత్తే. అయినప్పటికీ గతంలో పనిచేసిన అధికారులు, మీడియా, భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాం. అన్నిటినీ పరిశీలించి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాం. స్వామి దర్శనం, వసతిలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం' అని టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ఈనెల 4న శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

- బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన ఏర్పాట్లు
- 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమలలో ఈనెల 4 నుంచి 12వ తేది వరకు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. మూలవిరాట్టు దర్శనంతో పాటు వాహనసేవ దర్శనం సంతృప్తికరంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం. ఆలయంలోని క్యూలైన్లతో పాటు గ్యాలరీల్లోని భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడానికి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. గతంలో గరుడవాహనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తాయి? మరుగుదొడ్లు, తాగునీరు అందించడంలో ఎలాంటి సమస్యలు వచ్చాయి? గ్యాలరీల్లోకి రావడానికి, కూర్చోవడానికి భక్తులు పడిన ఇబ్బందులను తెలుసుకున్నాం. వాటిని అధిగమించేలా చర్యలు చేపట్టాం.

పెరటాసి రద్దీని తట్టుకునేలా..

తమిళ భక్తులకు ముఖ్యమైన పెరటాసితో పాటు బ్రహ్మోత్సవాలు కూడా రావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేశాం. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శనాలు రద్దు చేశాం. గరుడసేవకు ప్రొటోకాల్ దర్శనాన్నీ నిలిపేశాం. బ్రహ్మోత్సవాల రోజులకు సంబంధించి ఇప్పటికే 1.32 లక్షల దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో ఇచ్చాం. సర్వదర్శన టోకెన్లు రోజుకు 24వేల చొప్పున జారీ చేస్తాం. మామూలుగా 80 వేల మందికి దర్శనం చేయిస్తాం. కానీ బ్రహ్మోత్సవాల్లో రోజుకు 90 వేల నుంచి 95 వేల మంది దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశాం. మాడవీధుల్లోని గ్యాలరీల్లో 2 లక్షల మంది మాత్రమే కూర్చోగలరు. అదనంగా మాడవీధుల్లోని కార్నర్ క్యూలైన్ల ద్వారా దాదాపు 20 వేల మందికి వాహనసేవల దర్శనం చేయిస్తాం.

నడకదారి భక్తులకు...

అలిపిరి మార్గంలోని వచ్చిన వారికి గతంలో దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవారు. దాన్ని గతంలోనే రద్దు చేశారు. బ్రహ్మోత్సవాల తర్వాత ఆ విషయం ఆలోచిస్తాం. ప్రస్తుతం శ్రీవారిమెట్టు మార్గంలో వచ్చేవారికి దివ్యదర్శనం టోకెన్లు ఇస్తున్నాం. నడిచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రణాళికలు రూపొందించుకున్నాం.

60 వేల మందికి వసతి

తిరుమలలోని 7వేల గదుల ద్వారా 40 వేల మందికి వసతి లభిస్తుంది. యాత్రికుల వసతి సముదాయాల్లోని 68 హాళ్లద్వారా 7 వేల లాకర్లు ఉన్నాయి. వీటి ద్వారా 20 వేల మందికి వసతి కల్పించవచ్చు. ఇక, 411 బస్సుల ద్వారా 3వేల ట్రిప్పులతో ఆర్టీసీ సేవలందిస్తుంది. 4 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశాం. నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తాం.భక్తులకు ఇబ్బంది లేకుండా 7 లక్షల లడ్డూల బఫర్ స్టాక్ ఉంచుకున్నాం. లడ్డూ కౌంటర్లు 54 నుంచి 65కు కౌంటర్లను పెంచాం.

భక్తులకు భద్రత

తొలిరోజున సీఎం పర్యటనకు కూడా ఏర్పాట్లు పూర్తయ్యాయి. 3.5 లక్షల మంది భక్తులు గరుడసేవకు వస్తారని అంచనా. దానికి అనుగుణంగా అధికారులను, సిబ్బందిని సిద్ధం చేశాం. ఎక్కడా ఎక్కడ తోపులాటలు తొక్కిసలాటలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. 1,225 మంది విజిలెన్స్, 3,800 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. 2,770 సీసీ కెమెరాల ద్వారా నిఘా పెడుతున్నాం.



శ్రీవారి ఆలయ శుద్ధి కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు

శాస్త్రోక్తంగా శ్రీవారి ఆలయ శుద్ధి

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈనెల 4వ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆనందనిలయం నుంచి బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయంలోపల ఉన్న ఉపఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రిని నీటితో శుభ్రం చేశారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పేశారు. శుద్ధి తర్వాత నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేశారు. తర్వాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిఉన్న వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమ నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన అష్టదళ పాదపద్మారాధన, వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.తిరుమంజనం కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు,అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

227 మద్యం షాపులకు నోటిఫికేషన్

- తిరుమల బైపాస్ రోడ్డులో నో పర్మిషన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1: జిల్లాలో 227 ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు శ్రీనివాసాచారి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపుల్లో తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 32, గూడూరులో 12, నాయుడుపేటలో 13, సూళ్లూరుపేటలో 14, వెంకటగిరిలో 9, పుత్తూరులో 7, తిరుపతి రూరల్‌లో 12 చొప్పున ఉంటాయన్నారు. ఇవి కాకుండా జిల్లాలోని 26 మండలాల పరిధిలో 128 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇక, తిరుమలకు విచ్చేసే యాత్రికులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తిరుపతికి ప్రత్యేకంగా మద్యం దుకాణాల ఏర్పాటులో కొన్ని నిబంధనలు విధించినట్లు తెలిపారు. ఆ ప్రకారం.. తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్ మీదుగా (తిరుమల బైపాస్) అలిపిరి వరకు.. తర్వాత రుయా, స్విమ్స్ వద్ద కూడా మద్యం షాపుల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. ఎవరైనా అనుమతులు అతిక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. మద్యం షాపుల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్ ద్వారా లేదా హైబ్రిడ్ విధానంలో కానీ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 11న ఉదయం 8 గంటలకు తిరుపతి శిల్పారామంలో లాటరీ విధానంద్వారా దుకాణాలను అదే రోజు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈ నెల 11 వరకు అందుబాటులో ఉంటాయని.. 12 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లో ఉంటుందన్నారు. దుకాణాల కేటాయింపు పారదర్శకంగా, చట్టబద్ధంగా జరుగుతుందని, ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



పేలుడుతో తలకిందులైన కారు - క్లైమోర్ మైన్స్‌లో వాడిన ఇనుప గోళాలు (ఇన్‌సెట్‌లో)




ఆస్పత్రిలో చంద్రబాబు



ధ్వంసమైన చంద్రబాబు కారు



తల్లి అమ్మణ్ణమ్మ దుఃఖం



విస్ఫోటనం తీవ్రతకు తెగిపడ్డ తీగలు - పేల్చడానికి వాడిన ఫ్లాష్ (ఇన్‌సెట్‌లో)

అలిపిరిలో ఆ క్షణం

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


చంద్రబాబుపై క్లెమోర్‌మైన్ దాడి జరిగి 21 ఏళ్లు

2003 అక్టోబరు1, సాయంత్రం 4.05 గంటలు..

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు బయలుదేరారు. అలిపిరి టోల్‌గేట్ దాటగానే భారీ పేలుడు.. ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బులెట్ ప్రూఫ్ కారు ఆకాశంలోకి ఎగిరి పడింది. క్లెమోర్ మైన్స్‌తో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు చేసిన దాడి అది. కారులో చంద్రబాబుతో పాటూ అప్పటి మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు చదలవాడ కృష్ణమూర్తి, రెడ్డివారి రాజశేఖర రెడ్డి కూడా ఉన్నారు. అంత భారీ పేలుడులోంచి చంద్రబాబు సహా అందరూ గాయాలతో బయటపడడం విచిత్రం. ఆ దేవదేవుడి కరుణగా ఇప్పటికీ చెప్పుకుంటారు. అలిపిరి సంఘటనలో బాధితులూ, ప్రత్యక్ష సాక్ష్యుల 21 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు ఇవి...

ఆ శబ్దం ఇప్పటికీ చెవుల్లో మోగుతోంది

పుత్తూరు అభివృద్ధి కోసం రూ.300కోట్లు కావాలని కోరుతూ ఒక ప్రణాళిక తయారు చేసుకున్నా. దానిని సీఎం చంద్రబాబుకు వివరించాలి. తిరుపతిలో కార్యక్రమాల ఒత్తిడిలో ఆయన ఉన్నందున సాధ్యం కాలేదు. తిరుమలకు వెళ్లేలోగా వివరించవచ్చని ఆయనతోపాటు కారులో ఎక్కి కూర్చున్నా. కాన్వాయ్ టోల్‌గేట్ దాటింది, మొదలుపెట్టబోతుండగా పెద్ద శబ్దం ... అంతే.. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు. నేను బతకడం కష్టమని వైద్యులు చెప్పేశారట. అయితే చంద్రబాబు ఢిల్లీ, బెంగళూరుల నుంచి నిపుణులైన వైద్యులను పిలిపించారు. హెలికాప్టర్ తెప్పించి హైదరాబాద్‌కు తరలించారు. సమయం పట్టినా కోలుకున్నా. అమ్మ నాకు తొలి జన్మనిస్తే, అలిపిరి ఘటన మలి జన్మనిచ్చింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తుంటా.




- రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి, అప్పటి పుత్తూరు ఎమ్మెల్యే

కారు 20 అడుగులు ఎగిరి పడింది



ఆరోజు సీఎం చంద్రబాబుతో పాటు ప్రయాణిస్తున్నా. హఠాత్తుగా కారు 20 అడుగులు పైకి ఎగిరి కిందపడింది. పెద్ద శబ్దం మాత్రమే వినిపించింది. ఆ తర్వాత స్పృహ వచ్చేసరికి ఆస్పత్రి బెడ్‌పై ఉన్నా. కోలుకున్న తర్వాత అలిపిరిలో జరిగిందేమిటో కథలు కథలుగా చెబుతుంటే, శ్రీవారి కరుణాకటాక్షాలతోనే బతికామని అనిపిస్తుంటుంది. ఎక్కడైతే ఘటన జరిగిందో, అక్కడే టోల్‌గేట్ నిర్మించారు. టీటీడీ ఛైర్మన్‌గా తిరుమలకు వెళ్తూ సంఘటన జరిగిన ప్రదేశాన్నే తదేకంగా చూస్తూ ఉండేవాడిని. వెంకటేశ్వరస్వామి ప్రసాదించిన మరో జన్మలో జీవిస్తున్నా.



- చదలవాడ కృష్ణమూర్తి, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే

బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ...

సీఎం చంద్రబాబు స్విమ్స్ నుంచి తిరుమలకు బయలుదేరారు. లీడ్ కారులో డీఎస్పీ, నేనూ, మరో హెడ్ కానిస్టేబుల్ ఉన్నాం. టోల్‌గేట్ దాటుతుండగా వెనుక వస్తున్న వీఐపీ కారు మలుపు తిరిగిందా అని డీఎస్పీ చూడమన్నారు. నేను వెనక్కి తిరిగి చూస్తున్నా. పెద్ద బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ.. బ్లాస్టింగ్ అని అర్థమైపోయింది. కారులోంచి దూకి వెనక్కి పరుగెత్తా. ఇంకా బాంబులుండచ్చు. పేలచ్చు అని వారిస్తున్నా నేను వినలేదు. పొగలో ఎగిరి పడిపోయివున్న కారు వద్దకు చేరుకున్నా. ముందు సీటులో సీఎం పడిపోయి ఉన్నారు. వెనుక ముగ్గురు ఒకరిపై ఒకరు పడిపోయి ఉన్నారు. ముందుగా సీఎం గారిని కారులోనుంచి బయటకు తీశాం. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాం. మరుసటి రోజు పేలని మరో 12 క్లెమోర్ మైన్స్ అక్కడ బయటపడ్డాయి. అవికూడా పేలివుంటే ఎవ్వరమూ మిగిలివుండేవాళ్లం కాదు. ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో అటువంటి పరిస్థితిని ఎదుర్కొనే శక్తిని ఆ స్వామే నాకు ఇచ్చాడనిపిస్తుంది.





- అంజూ యాదవ్, పోలీసు అధికారి

ఆ దృశ్యం మిగిలిపోయింది



టీవీ జర్నలిస్టుగా కాన్వాయ్‌తో పాటూ కొండకు బయలుదేరా. వెనుక కారులోంచి ముందుకు సాగిపోతున్న కార్ల బారును కెమెరాలో ఫోకస్ చేశా. ఇంతలో ఢాం.. అంటూ భారీ విస్ఫోటనం..ముందున్న కార్లు చిల్లాపల్లాలుగా పడిపోయాయి. కార్లోంచి దూకి కెమెరాను ఫోకస్‌లోనే పట్టుకుని తెగి పడివున్న తీగలు దాటుకుంటూ ముందుకు పరుగు తీశా.నల్లటి పొగ కమ్ముకుని ఉంది. గాల్లోకి ఎగిరిన రాళ్ల ముక్కలు మీద పడుతున్నాయి. సీఎం కారు ఎక్కడా అని వెతుక్కుంటున్నా. ఆ దుమ్మూ పొగలోనే బోల్తాపడివున్న కారు చుట్టూ సీఎం సెక్యూరిటీ కోటలా చుట్టుకుని ఉన్నారు. పడమటి దిక్కున కొండల వెనుక సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఎగిరి బోల్తాపడ్డ కారులోంచి చంద్రబాబును పైకి తీస్తున్నారు.. ఆ దృశ్యం నా కెమెరాలోనే కాదు నా గుండెల్లోనూ ఇప్పటికీ చెరగని ముద్రలా ఉండిపోయింది. మిగిలిన బాంబులు పేలివుంటే ఏమయ్యేది.. నేను చచ్చిపోయివుంటే మా అమ్మ ఏమైపోయేది.. అని ఆ తర్వాత తలుచుకుని వణికిపోయా.

- మునిరాజ, టీవీ జర్నలిస్టు

తొలి ఫొటో నాదే!



చంద్రబాబు కాన్వాయ్ కొండకు బయలుదేరింది.వెనుక సెక్యూరిటీ కారులో నేనున్నా. 'దర్శనం ఎన్నిగంటలకు' అని పక్కనే ఉన్న సెక్యూరిటీ వాళ్లను అడుగుతూ ఉన్నా. ఇంతలో భారీ పేలుడు శబ్దం వినిపించింది. దట్టంగా పొగ.. అరుపులు..కేకలు.. కారులోంచి అందరం బయటకు దూకి సీఎం కారువైపు పరుగులు తీశాం. రోడ్డు పక్కన కాలువలో కారు పడిపోయివుంది. అప్రయత్నంగా నా చేతులు కెమెరాను ఎయిమ్ చేశాయి. సెక్యూరిటీ, పోలీసు సిబ్బందీ దెబ్బతిన్న కారులోంచి చంద్రబాబును పైకి తీస్తూ ఉన్నారు. క్లిక్..క్లిక్.. క్లిక్ మంటూ నా వేళ్లు నొక్కుతూనే ఉన్నాయి. ఇప్పటిలాగా అప్పుడు డిజిటల్ కెమెరాలు లేవు. ఫిలిం కెమెరాలే. దుమ్ము, పొగలో ఫొటోలు ఎలా వస్తాయో కూడా తెలీదు. టెన్షన్.. టెన్షన్. చివరికి ఆ ఫొటోలే అలిపిరి సంఘటనకు ప్రధానం అయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే తీసిన తొలి ఫొటో నాదే అయ్యింది.

- మాధవ్, అప్పటి సీఎం అధికారిక ఫొటోగ్రాఫర్

కళాశాల బస్సు బోల్తా: ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన కళాశాల బస్సు

చిల్లకూరు, అక్టోబరు 1: మండలంలోని చిత్తవరం కొత్తపాళెం సమీపంలో మంగళవారం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు బోల్తా పండింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులతో పాటు ఓ అధ్యాపకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... కోట విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల బస్సు మంగళవారం ఉదయం 7.15 నిమిషాలకు ముత్తుకూరు వద్ద విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. వరగలి, చింతవరం గ్రామాల మీదుగా విద్యానగర్‌కు వెళుతుండగా చింత్తవరం కొత్తపాళెం సమీపంలో అదుపుతప్పి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముత్తుకూరు చెందిన విద్యార్థులు ఝాన్సీ, కులదీపక్, అధ్యాపకుడిగా పనిచేస్తున్న చిల్లకూరు మండలం పొన్నపోలుకు చెందిన వెంకటరమణయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులకు చింతవరం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి నెల్లూరుకు తీసుకువెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 1: నాయుడుపేట మండలంలోని స్వర్ణముఖి నది నుంచి వెంకటగిరి పట్టణంలోకి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గూడూరు అర్బన్, అక్టోబరు 1: మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకు వెళ్లిన సంఘటన మండలంలోని చెన్నూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... చెన్నూరు గ్రామానికి చెందిన నీరజ మరో ఇద్దరు మహిళలతో కలిసి వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా జెండా ఉత్సవాలు జరుపుకుందాం: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 1: పట్టణంలో బుధవారం నిర్వహించనున్న ఆంజనేయ స్వామి జెండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రోటరీ భవనంలో పోలీసు అధికారులు, జెండా ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరులో నిర్వహించే జెండా ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గతంలో బయటప్రాంతాల నుంచి రౌడీషీటర్లు ఉత్సవాలకు వచ్చి అల్లర్లకు పాల్పడ్డారని, ఈసారి అలాంటి సంఘటనలు జరకుండా పోలీసులు, నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు, ఎస్‌ఐలు తిరుమలరావు, గోపాల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

ముస్తాబైన పట్టణం

ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు పట్టణం ముస్తాబైంది. ఏటా విజయదశమి ముందు వచ్చే అమావాస్య నాడు గూడూరులో ఆంజనేయస్వామి జెండాలను ఊరేగించడం ఆనవాయితీ. పట్టణంలో సుమారు 30 ప్రాంతాల్లో జెండా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా గమళ్లపాళెం, మిట్టపాళెం, తూర్పువీధి, కర్ణాలవీధి, కోనేటిమిట్ట, మాళవ్యానగర్ తదితర ప్రాంతాల్లో భారీ విద్యుత్ దీపాలతో వివిధ దేవుళ్ల కటౌట్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వీధులన్నీ విద్యుద్దీపాలకరణతో శోభాయమానంగా మారాయి.



విద్యుద్దీపాలంకరణ కటౌట్

లడ్డూ నెయ్యిలో కల్తీ వాస్తవమే.. కానీ జంతువుల కొవ్వు కాదు: చింతా



మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

సూళ్లూరుపేట, అక్టోబరు 1: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ వాస్తవమేనని, అయితే జంతువుల కొవ్వు కాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో ఏమి కల్తీ చేశారో నిర్ధారించిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడి ఉండాల్సిందని, ఆయన తొందరపాటు వల్ల భక్తుల్లో అపోహలు కలిగాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పాలకవర్గం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కిలో ఆవు నెయ్యి రూ.700 పైచిలుక ధర పలుకుంటే రూ.320కి ఎలా సరఫరా చేస్తారని, కల్తీ లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఉన్న భవనాలను కూల్చి సత్రాల పేరుతో కొత్త నిర్మాణాలు చేపట్టారని విమర్శించారు. సూళ్లూరుపేటలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణంపై సీఎం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, ఈశ్వరయ్య, జి.వెంకటయ్య, ఎస్కే నాగూర్ బాబు, కేవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

వాకాడు, అక్టోబరు 1: కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 20 మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 11న కలెక్టర్ నేతృత్వంలో లాటరీ తీసి లైసెన్స్ కేటాయిస్తామని, 12వ నుంచి కొత్త దుకాణాలను ప్రారంభించుకోవచ్చన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 1: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి కనుపూరు మండలం తాళ్వాయిపాడు గ్రామస్తులు రూ.50వేల విరాళం అందజేశారు. మంగళవారం రాత్రి నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, తాళ్వాయిపాడు గ్రామస్తులు కిలారి గోపీ, బాలయ్య, శ్రీనివాసులు, చలపతి, మహేశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు...



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 1: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో పాటు ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులతో సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలిగినప్పుడు వారి మధ్య బేధాభిప్రాయాలు ఉండవన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న కోర్సులకు మంచి అధ్యాపకులు ఉన్నారని, అంతేకాకుండా విద్యార్థులకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉండటం సంతోషదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన వర్మ, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పెసల జయరాజ్‌గోపాల్, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ, నాగేంద్రరెడ్డి, పసల గంగాప్రసాద్, ఫైలారి రాజశేఖర్, అరవపెరిమిడి చంద్రారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భూములకు హక్కులు కల్పించండి

సూళ్లూరుపేట, అక్టోబరు 1: ఓజిలి మండలం మాచవరంలో దళిత, గిరిజనులకు 1986లో ఇచ్చిన భూములకు హక్కులు కల్పించాలంటూ మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీపీఎం నాయకుడు పద్మనాభం మాట్లాడుతూ పేదలకిచ్చిన భూములను ఆ గ్రామ పెద్దలు ఆక్రమించుకుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో అల్లెయ్య, సాంబశివయ్య, రియాజ్, గురవయ్య, మురళి పాల్గొన్నారు.

ఆలయాల నిర్వహణను హిందూ ధార్మిక పరిషత్‌కు అప్పగించాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 1: ఆలయాల నిర్వహణ బాధ్యతను హిందూ ధార్మిక పరిషత్‌కు అప్పగించాలంటూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సూళ్లూరుపేటలో ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షురాలు సుంకర ప్రతిమ ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణ వీధిలోని రామాలయం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకొన్నారు. ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల్లో అన్యమతస్తులను తొలగించి హిందువులనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కమ్మిరెడ్డి, శివప్రసాద్ రెడ్డి, నారాయణ, పద్మజ, ఆదినారాయణరెడ్డి, మమత, శారద, కళావతి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

డక్కిలి, అక్టోబరు 1: దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టినట్లు ఈవో శ్రీధర్ నాయుడు తెలిపారు. 155 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.9,82,800 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ మొత్తాన్ని స్టేట్‌బ్యాంకులో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెకర్ శ్రీనివాసబాబు, రెవిన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

గూడూరు, అక్టోబరు 1: విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు చెకుముకి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

కోట, అక్టోబరు 1: మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ వజ్జవారిపాళెంలో వివాదాస్పద ప్రభుత్వ భూములను మంగళవారం తహసీల్దారు జయజయరావు పరిశీలించారు. ఇక్కడి ప్రభుత్వ భూములకు బయటప్రాంతాల వ్యక్తులు నకిలీ పాసుపుస్తకాలు చేయించుకొని సాగుచేస్తున్నారని వజ్జవారిపాళెం గ్రామస్తులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దారు ఆ భూములను పరిశీలించారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్

సూళ్లూరుపేట, అక్టోబరు 1: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్ర మండలాల నుంచి ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలకు చెందిన 135మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈనెల 27న జిల్లాస్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు శ్యామూల్, మస్తాన్, చంద్రశేఖర్, యూటీఎఫ్ నాయకులు ప్రభాకర్, సుశీల, సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

వెంకటగిరి, అక్టోబరు 1: ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని విడనాడి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని క్రాస్ రోడ్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశేఖరం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వెంకటసుబ్బయ్య, మంజునాధరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు వెంకటకార్తీక్

గూడూరు, అక్టోబరు 1: మండలంలోని నెల్లటూరు ఉన్నత పాఠశాల విద్యార్థి వెంకటకార్తీక్ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పార్వతమ్మ తెలిపారు. నెల్లూరులో నిర్వహించిన జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో వెంకటకార్తీక్ అండర్-17 బాలుర విభాగంలో ప్రతిభ చాటడంతో రాష్టస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్ఎంతో పాటు పీడీ విజయ వెంకటకార్తీక్‌ను అభినందించారు.

నాకు తెలియకుండానే జడ్పీలో ఉద్యోగుల బదిలీలు

- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడీ), అక్టోబరు 1 : జిల్లా పరిషత్‌లో తన ఆమోదం లేకుండానే అధికారులు ఇష్టానుసారంగా బదిలీలు చేశారని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మండిపడ్డారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఛైర్మన్ ఆమోదం లేకుండా రాజ్యాంగబద్ధంగా బదిలీలు చేసేందుకు వీల్లేదన్నారు. కేవలం ఎంపీడీవోల బదిలీల నోట్‌ఫైల్ మాత్రమే తనకు పెట్టి సాధారణ ఉద్యోగులు బదిలీలకు సంబంధించి తనకు తెలియకుండానే ఇష్టానుసారంగా బదిలీలు చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఈ బదిలీలను రద్దు చేయాలని కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రికి ఇప్పటికే విన్నవించినట్లు చెప్పారు. బదిలీలను రద్దు చేయడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. జడ్పీ ఛైర్మన్‌కు రాజ్యాంగబద్ధంగా సక్రమించిన అధికారాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మర్రిపాడు, కొండాపురం, ఆత్మకూరు, గూడూరు, సూళ్ళూరుపేట జడ్పీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, వెంకట్రావు, ప్రసన్న, యామిని తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ కాలనీ గిరిజన సెంటర్‌లో ఎస్ఎస్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు అందజేశారు. నిర్వాహకురాలు నాదెండ్ల శాంతకుమారి, సూర్య కుమారి, చెంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.